నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
బుధవారం | ఏప్రిల్ 17, 2024 | www.navatelangana.com

పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంటు ఎన్నికలకు ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో 18వ తేదీ నుండి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. దీంతో వరంగల్ జిల్లా యంత్రాంగం నామినేషన్ల స్వీకరణకు వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. వరంగల్ జిల్లా కలెక్టర్, వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. ప్రావీణ్య, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, హన్మకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం అన్ని ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పార్లమెంటు ఎన్నికలకు ఈనెల 18న పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మంగళవారం కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన ఏర్పాట్లను వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూతో కలిసి స్వయంగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

రేపు నోటిఫికేషన్

పార్లమెంటు ఎన్నికలకు గురువారం వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల అధికారి, వరంగల్ కలెక్టర్ పి. ప్రావీణ్య నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈనెల 18వ తేదీ నుండి నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ల స్వీకరణకు ఏప్రిల్ 25వరకు తుది గడువు, ఈనెల 26న నామినేషన్లను పరిశీలించనున్నారు. ఏప్రిల్ 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు కాగా, ఎన్నికలు మే 13వ తేదీన జరుగనున్నాయి. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలను ప్రకటించనున్నారు.

- ఏప్రిల్ 18న నామినేషన్ల స్వీకరణ
- నామినేషన్లకు తుది గడువు ఏప్రిల్ 25
- నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 26
- ఉపసంహరణకు తుది గడువు ఏప్రిల్ 29
- పోలింగ్ తేదీ మే 13
- ఎన్నికల ఫలితాలు జూన్ 4

నామినేషన్ల ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- ఎస్సీ, ఎస్టీలకు రూ.12,500, సాధారణ అభ్యర్థులకు 25 వేల డిపాజిట్
- అభ్యర్థులు రూ.95 లక్షలకు మించి ఖర్చు చేయరాదు
- వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య



నవతెలంగాణ-వరంగల్

లోక్‌సభ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ ను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని వరంగల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి ప్రావీణ్య కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాల యంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మంగళవారం నామినేషన్ల ప్రక్రియపై జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 18 నుండి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ అంశాలపై కలెక్టర్ కూలంకశంగా వివరించారు. లోకసభ ఎన్నికల సందర్భంగా ఈనెల 18 నుండి 25 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని,26 నామినేషన్ల పరిశీలన, 29 న ఉపసంహరణ ఉంటుందని వెల్లడిం చారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి ఛాంబర్ లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఉదయం 11 గంటలనుండి మధ్యాహ్న 3 గంటల వరకు నామి నేషన్ల స్వీకరణ ఉంటుందని, మధ్యాహ్నం 3 తర్వాత నామినేషన్లు స్వీకరించమని కలెక్టర్ స్పష్టం చేశారు. నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు వారితోపాటు, అనుమతించే వ్యక్తులు, వాహనాలు, తదితర అంశాలను కలెక్టర్ వివరిం చారు.

నామినేషన్ వేయడానికి ముందే పోటీ చేసే అభ్యర్థి పేరు మీద ఏదైనా జాతీయ బ్యాంకులో ఎలక్షన్ ఖర్చుల కోసం కొత్త ఖాతాతెరవాలని సూచించారు. నామినేషన్ల సందర్భంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీకి కేటాయించినందున ఎస్సీ అభ్యర్థులు రూ.12,500లు సెక్యూరిటీ డిపాజిట్ చేయవలసి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజకీయ పార్టీ ల ప్రతినిధులకు ఆమె అవగాహన కల్పించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం అభ్యర్థుల ఖరారు తర్వాత ఎన్నికల ఖర్చుల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి, పాటించవలసిన నియమ నిబంధనలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంపై వివరంగా తెలిపారు.

ఎన్నికల సందర్భంగా ప్రచురించే కరపత్రాల విషయంలో ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 127 ఏ నిబంధనలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుందని తెలిపారు. లోక సభ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు రూ.95 లక్షల కు మించి ఖర్చు చేయకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వ నారాయణ, కాంగ్రెస్ పార్టీ నుండి ఈవి శ్రీనివాస్, నిహాల్, బీజేపీ నుండి అమరేందర్, బక్క హరిశంకర్, నిశాంత్, టీడీపీ నుండి నాగరాజు, బీఎస్పీ నుండి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సత్యం, ధర్మానికి కట్టుబడి ఉండాలి

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ-వరంగల్

ఎంతటి విషమ పరిస్థితుల్లోనైనా సత్యం, ధర్మానికి కట్టుబడి ఉండాలనే సందేశాన్ని శ్రీరాముని జీవితం మనకు అందిస్తుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శ్రీరామనవమి పురస్కరించుకుని మంత్రి సురేఖ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు ఆచరించి చూపిన జీవన ప్రమాణాలు జీవితంలో మనకు ప్రతి దశ లోనూ స్ఫూర్తినిస్తాయని తెలిపారు. సీతారాముల ఆదర్శ జీవితం భారతీయ కుటుంబ ఔన్నత్యాన్ని చాటుతుందని అన్నారు. అందుకే యుగాలుమారినా సీతారాములను ఆరాధ్య దైవాలుగా కొలుస్తూ, వారి కల్యాణాన్ని కులమతాలకు అతీతంగా వీక్షిస్తా రని అన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా రామ రాజ్య స్థాపనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తున్నదన్నారు. రామరాజ్యం అంటే మతపరమైన రాజ్యంకాదని, ప్రజలే పాలకులైన రాజ్యమని మహాత్మాగాంధీ అన్న మాటలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలు ఎలాంటి వివక్ష, అణిచివేతకుగురికాకుండా, అందరికీ సమానహక్కులు లభిస్తూ, సంతృప్తిగా జీవించే రాజ్యమే రామరాజ్యమని స్పష్టం చేశారు. శ్రీరాముని గుడి లేని ఊరు లేదు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకంచేరని గడప లేదన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటు ప్రజల భవిష్యత్తును నిర్ణయిస్తుంది

- వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి



నవతెలంగాణ-వరంగల్

భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమే అని వరంగల్ జి ల్లా స్వీప్ నోడల్ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి అభిప్రాయపడ్డారు. లోక్ సభ ఎన్నికల నేపద్యం లో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వరంగల్ (తూర్పు)లో స్వీప్ -2024 అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మెప్మా సమావేశం మందిరంలో ఆశయం పట్టణసమాఖ్య సభ్యులకు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేయడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా బల్దియా టిపిఆర్‌ఓ కోలా రాజేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నోడల్ అధికారి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకభూమిక వహిస్తుందని ప్రధానంగా యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని ఓటుహక్కు ప్రాధాన్యతను స్వయం సహాయక మహిళ బృందాల సభ్యులకు తెలియ జేసి పెద్ద ఎత్తున ప్రజలు ఓటింగ్‌లో పాల్గొని పోలింగ్‌శాతం పెంచేలా పట్టణ సమాఖ్యలు తమవంతు పాత్ర పోషించాలన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య సభ్యులచే ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం ని ర్వహించారు. ఈ సమావేశంలో టిఎంసి రమేష్, సిఓలు నాగరాజు, శ్రీలత, రజిత,రమ, ప్రవీణ్, సఫియా, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికలకు బీఆర్‌ఎస్ సమన్వయకర్తల నియామకం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమన్వయకర్తలను నియమించారు. బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను ఆ పార్టీ నియమించింది. పరకాల నియోజకవర్గానికి ఎమ్మెల్సీ డాక్టర్ బండాప్రకాశ్, పాలకుర్తికి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మెట్టు శ్రీనివాస్, స్టేషన్‌ఘన్‌పూర్‌కు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమకు కుడా మాజీ ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకన్న, సుందర్‌రాజ్ యాదవ్, వరంగల్ తూర్పుకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వర్ధన్నపేటకు మాజీ జెడ్పీ ఛైర్మన్ ఎస్.సమ్మారావు, కె.వాసుదేవరెడ్డి, భూపాలపల్లికి ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యలు ఇన్‌ఛార్జిలుగా వ్యవహరించనున్నారు.

సివిల్స్‌లో మెరిసిన ఉమ్మడి వరంగల్ ఆణిముత్యాలు







నవతెలంగాణ-కాశిబుగ్గ / గీసుగొండ

యూపీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురు యువకులు విజేతలుగా నిలిచారు. గత ఏడాది ఐపిఎస్ సాధించిన జయసింహారెడ్డి ఈసారి 103వ ర్యాంకు సాధించడంతో ఐఏఎస్ సాధించే అవకాశాలు అధికంగా వున్నాయి. రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యాడ ప్రణయ్ 554వ ర్యాంకు సాధించారు. ప్రణయ్ ఎలాంటి కోచింగ్ లేకుండానే ఈ ర్యాంకు సాధించడం గమనార్హం. గత ఏడాది 885వ ర్యాంకు సాధించిన ప్రణయ్ ఐఆర్ఎంఎస్ రావడంతో ప్రస్తుతం శిక్షణలో వున్నారు. గీసుకొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సయింపు కిరణ్ 568వ ర్యాంకు సాధించారు. వరంగల్ శివనగర్‌కు చెందిన కోట అనిల్‌కుమార్‌కు 764 ర్యాంకు సాధించారు.కిరణ్‌కు ఐపిఎస్ వచ్చే అవకాశముండగా, కోట అనిల్‌కుమార్‌కు ఐఆర్ఎస్ వచ్చే అవకాశమున్నట్లు అంచనా.

ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే.. మొదటి ప్రయత్నంలో ఐపీఎస్, రెండవసారి ఐఏఎస్

హనుమకొండ ప్రాంతానికి చెందిన జయసింహారెడ్డి ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే సివిల్స్ రాయగా మొదటిసారి 217ర్యాంకు సాధించి ప్రస్తుతం ఐపిఎస్ శిక్షణ తీసుకుంటున్నాడు. అయినా తృప్తిచెందని జయసింహారెడ్డి పట్టుదలని విక్రమార్కుడిలా మరోసారి సివిల్స్ రాయగా మంగళవారం వెలువడిన ఫలితాల్లో 103వ ర్యాంకు సాధించి, ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. హనుమకొండ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఉమారెడ్డి కుమారుడు జయసింహారెడ్డి 7వ తరగతి వరకు జగిత్యాలలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యనభ్యసించారు. అనంతరం వరంగల్ నగరంలోని ఎస్సార్ పాఠశాలలో 8,9,10 తరగతులు చదివారు. అనంతరం ఇంటర్ (ఎంపీసీ) హైదరాబాదులోని నారాయణ కళా శాలలో పూర్తి చేసి, ఐఐటీ చ దివిన అనంతరం ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే సివి ల్స్ రాయగా 217ర్యాంకు వచ్చింది. ప్రస్తుతం అతను ఐపిఎస్ శిక్షణ పొందుతున్నాడు. తిరిగి సివిల్స్ రాయగా ఈసారి 103వ ర్యాంకుతో ఐఏఎస్ ఎంపికయ్యారు.

కష్టజీవి కుటుంబంలో ఐఏఎస్

గీసుగొండ మండలంలోని అనంతరం గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన సయంపు ప్రభాకర్‌రావు-జయ దంపతులకు ఇద్దరు సంతానం వారిలో పేద్ద వాడు కిరణ్, చెల్లె దివిజ రెండవ సంతానం. చిన్ననాటి నుండి తల్లిదండ్రుల కష్టం చూసి మొక్కవోని దీక్షతో వారి కష్టానికి ప్రతిఫలాన్ని ఇచ్చి జిల్లా యువతకు కిరణ్ ఆదర్శంగా నిలిచారు.

విద్యాభ్యాసం ...

జవహర్ నవోదయ స్కూల్లో పదవ తరగతి పూర్తి చేసి భాష్యం విద్యాసంస్థలు ఇంటర్మీడియట్ పూర్తి చేశానని అనంతరం బీటెక్ కోసం రాసిన ఎంట్రన్స్‌లో ఢిల్లీ ఐఐటీలో సీటు సంపాదించడం జరిగిందని తెలిపారు.

చెల్లి సహకారంతో చదువుకున్నాను

నా చెల్లె దివిజ సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూ నన్ను ఎంతగానో ప్రోత్సహించి ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైన నేనున్నానంటూ తల్లిదండ్రులతో కలిసి నా గెలుపులో ప్రత్యేక పాత్ర పోషించిందని కిరణ్ తెలిపారు.

ఓటమి గెలుపుకు పునాది

2018 నుంచి 5 సార్లు ప్రయత్నించగా ఐదవ సారి రెండు మార్కుల తేడాతో నేను అనుకున్న స్థాయి ఉద్యోగం రాలేదని అనంతరం ఇతర పోటీ పరీక్షలు రాయగా అసిస్టెంట్ కమాండెంట్ ,పోస్టల్ ఐపీఎస్‌వో దాంట్లో ఉద్యోగం పొంది ట్రైనింగ్ లో ఉన్నానని అనంతరం మళ్లీ కోచింగ్ నిమిత్తం లీవ్ తీసుకుని ఇష్టంగా చదివి విజయాన్ని సాధించాలని కోరికతో ఆరవసారి ప్రయత్నం చేయగా ఈసారి 568 ర్యాంకు జిల్లాలో రెండోర్యాంకు నాకు రావడం జరిగిందని ఆయన హర్షం వ్యక్తంచేశారు. నేను సామాన్య వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తిని అని వ్యవసాయ దారులు చేసే ప్రతి కష్టం నాకు తెలుసు అని ఆయన తెలిపారు.

కిరణ్‌ను సన్మానించిన తహశీల్దార్, స్థానికులు

మండలంకు చెందిన ఎమ్మార్వో రియాజుద్దీన్ , గ్రామస్తులు చుట్టుపక్కల గ్రామాల స్థానికులు సివిల్స్‌లో ఉత్తమ ర్యాంకుతో కలెక్టర్‌గా ఎంపికైన కిరణ్‌ను పూలబొకే, శాలువాతో ఘనంగా సన్మానించారు. నేటి యువత కిరణ్‌ను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని, ఉన్నత కొలువులు సాధించాలని వారు అన్నారు.

అసైన్డ్ భూముల్లో వెలిసిన వెంచర్‌లు

- పీవోటీ 1977 చట్టం రియాల్టర్‌లు భేఖాతర్
- పకడ్బందీ చర్యలకు అధికారుల వెనుకంజ..!



నవతెలంగాణ-నర్సంపేట

అనుమతి లేకుండా వెంచర్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.. సాధారణ భూములైనా.. అసైన్డ్, ప్రభుత్వ భూములైనా దాని స్వభావం ఏదైనా..రియాల్టర్‌ల కన్ను పడితే చాలు చేతికి చిక్కాల్సిందే..స్వాహా కావాల్సిందే..! అడ్డదారుల్లో కారుచౌకగా కొనుగోలు చేసి..అధిక రేటులో అమ్మకాలతో అనతికాలంలోనే కోట్లు మూటకట్టాలనే ఆపేక్ష.. వెరసి పేదోడికి జానెడు జాగ కరువైపోతుంది.. పట్టణంలో ఎక్కడిక్కడా భూములన్నీ మటుమాయమవుతున్నాయి..అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులుఅడ్డుకోలేక పోతున్నారు. కొందరు అధికార పార్టీ నేతల ఒత్తిడితో అధికారులు చర్యలు తీసుకొనేందుకు వెనకంజ వేస్తున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి.. పీవోటీ చట్టం 1977 ప్రకారం అసైన్డ్ భూములు అమ్మకాలు, కొనుగోలు చేయడం విరుద్ధమైనా యధేచ్ఛగా సాగుతునే ఉన్నాయి. ఇందుకు ఉదాహరణే మాధన్నపేట రోడ్డులోని సర్వేనెంబర్ 111/28లో వెలిసిన అక్రమ వెంచర్ అని చెప్పుకోవచ్చు.. అమ్మకాలు సాగించిన ఈ అసైన్డ్ భూమిపై రెవెన్యూ అధికారులు అసైన్డ్ దారులకు కిందటేడాది నోటీసులు జారీ చేశారు. అమ్మకాలు నిషేదం అంటూ బోర్డును కూడాపాతారు. అయినా రియాల్టర్‌లు భేఖాతర్ చేస్తూ తిరిగి ప్లాట్‌లను చేసి అమ్మకాలకు పెట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూముల్లో అమ్మకాలను నియంత్రించి పీవోటీ యాక్టు ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అసైన్డ్ భూముల్లో అమ్మకాలు, కొనుగోలు నిషేధం: విశ్వప్రసాద్, తహశీల్దార్ నర్సంపేట

పీవోటీ యాక్టు 1977 ప్రకారం ప్రభుత్వ, అసైండ్ భూముల్లో అమ్మకాలు చట్టవిరుద్ధం. మాధన్నపేట రోడ్డులోని 111/28లోని అసైన్డ్ భూముల్లో ప్లాట్‌లు చేయడం తమ దృష్టికి వచ్చింది. ప్లాట్ల అమ్మకాలు, కొనుగోలు చేయడం నిషేధం అంటూ బోర్డుఅమర్చి తగుచర్యలు తీసుకుంటాం. ఈ భూమిలో ఇదివరకే బోర్డును అమర్చాం దానిని తొలగించారు. తిరిగి అసైన్డ్‌దారులకు నోటీసులు జారీ చేస్తాం. వ్యవసయేతర అవసరాలకు ఇట్టి భూమిని ఉపయోగించడానికి వీలులేదు. చట్ట ప్రకారం స్వాధీన పర్చుకొని ప్రభుత్వ అవసరాలకు ఉపయోగిస్తాం.

గెలుపే లక్ష్యంగా పనిచేసి సుధీర్‌ను గెలిపించాలి : చల్లా ధర్మారెడ్డి



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఎం.సుధీర్ కుమార్‌ను గెలిపించాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. మంగళవారం హన్మకొండ లోని 'చల్లా' స్వగృహంలో పరకాల నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'చల్లా' మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలకు న్యాయం జరిగిందని, నాలుగు నెలల రేవంత్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. రైతులు సాగునీరందక, కరెంటు లేక చుక్కలు చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు సమన్వయంతో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నియోజక వర్గంలో అత్యధిక మెజార్టీని సాధించాలన్నారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని కోరారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

అండగా వుంటా.. దీవించండి : డాక్టర్ సుధీర్‌కుమార్

ఒక్కసారి నన్ను దీవించాలని, మీకు అండగా వుంటానని బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు, మహిలలకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండుపార్టీలు ఒక్కటేనన్నారు. బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. కన్నతల్లి లాంటి పార్టీని మోసం చేసిన వాళ్లకు ప్రజలు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా వున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో నాలుగు నెలలు తిరక్కుండానే ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామని ప్రజలు భావిస్తున్నారని, ప్రజల్లో మార్పు ప్రారంభమైందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఇలాంటి పరిస్థితులు ఏనాడు రాలేదన్నారు. పరకాల నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీ వస్తుందన్న నమ్మకం వుందన్నారు. ఈ సమావేశంలో ఎనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, వీరగోని రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలా పనులను వేగంగా పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



నవతెలంగాణ-సుబేదారి

హనుమకొండ నయీమ్ నగర్ వంతెన నుండి ప్రారంభమైన నాలా అభివృద్ధి పనులను వానాకాలం ప్రారంభం నాటికి పూర్తి కావాలని, అందుకు సంబంధించిన పనులను వేగవంతంగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్లో హనుమకొండ నయీమ్ నగర్ వంతెన నుండి చేపట్టిన నాలా అభివృద్ధి పనులు కొనసాగుతుండగా వాటిపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి రెవెన్యూ, మున్సిపల్, టౌన్‌ప్లానింగ్, సాగునీటి పారుదల, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలా ఇరువైపుల కొనసాగుతున్న నిర్మాణ పనులు, దాని పరిధిలో బఫర్ జోన్ వివరాలు, ఎప్పటిలోగా నాలా అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నారు, పూడికతీత పనులు, అభివృద్ధి పనుల సందర్భంగా ఎదురవుతున్న ఇబ్బందులు, పనులకు సంబంధించిన యాక్షన్ ప్లాన్, నయీమ్ నగర్ వంతెన, తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాలా అభివృద్ధికి సంబంధించిన పనులపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. నాలా అభివద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడంలో అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. నాలా అభివద్ధి పనులను జూన్ 15వ తేదీలోగా పూర్తి కావాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ విజయ్‌కుమార్, జిడబ్ల్యూఎంసి ఈఈ రాజయ్య, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుకుంటా : రేవూరి



నవతెలంగాణ-నడికూడ

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ధర్మారంకు చెందిన మాజీ సర్పంచులు భాష బోయిన ఐలయ్య బాల్నె రఘుపతి, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ఇంటి రమణారెడ్డి, ఇంటి రాజిరెడ్డి, పిల్లల రవీందర్‌తో పాటు 50 మంది బిఆర్ఎస్ నాయకులు, వివిధ కుల సంఘాలు, యూత్ నాయకులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మలహాల్ రావు, గడల రమేష్, పెద్ద బోయిన రవీందర్, నారగాని కుమారస్వామి, దుప్పటి సదానందం, వీరేషం, పాలడుగుల జయపాల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలి : ఎంఎస్‌పీ

నవతెలంగాణ-హన్మకొండ

సీఎం రేవంత్ రెడ్డికి రాజకీయంగా జెడ్పీటీసీ నుండి మొదలుకుని ఎంపీ అయ్యే వరకు మాదిగలే అండగా నిలిచారని అలాంటి మాదిగలను రాజకీయంగా ఎదగకుండా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మాదిగల వ్యతిరేకి మల్లికార్జున్‌ఖర్గేతో కలిసి మాదిగలను అణచివేస్తున్నాడని ఎంఎస్‌పి జాతీయ నాయకులు మంద కుమార్‌మాదిగ విమర్శించారు. మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్ వేద కన్వెన్షన్ లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నారాయణఖేడ్ కాంగ్రెస్ జన జాతర సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని, మంద కృష్ణమాదిగను విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదని అన్నారు. ఇప్పటికైనా మాదిగలకు క్షమాపణ చెప్పి ఎంపీ స్థానాల్లో వరంగల్, నాగర్ కర్నూల్ టికెట్లు ఇవ్వాలని, కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాదిగల నుండి అభ్యర్థిని నిలబెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి జాతీయ నాయకులు వేల్పుల సూరన్నకాపు, జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్ను దినేష్ మాదిగ, ఎంఎస్‌పి వరంగల్ ఇన్చార్జ్ మంద రాజుమాదిగ, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ, కందికట్ల విజయ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమం



నవతెలంగాణ-నయీంనగర్

కాకతీయ యూనివర్సిటీ మైదానంలో మంగళవారం ఉదయం కేయూ వాకర్స్ సంఘాలు,స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమం జరిగింది. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించు కొని దేశ భవిష్యత్ కోసం మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని అధికారులు కోరారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి,స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీరమాకాంత్, వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కో-ఆర్డినేటర్ దేశిని లక్ష్మి నారాయణ, మండల పంచాయతీ అధికారి రవిబాబూ, కేయు ఆచార్యులు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వీసం నారాయణ, స్వీప్ ఆఫీస్ బేరర్స్ సోమేష్, రాజు, విక్రమ్, హరీష్, వాకర్స్, యోగా, మహిళ సంఘాల ప్రతినిధులు, వాకర్స్ పాల్గొన్నారు.

రైల్వే సమస్యలపై డీఆర్ఎంను కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నయీంనగర్

సికింద్రాబాద్ లో రైల్వే డిఆర్ఎంను కలిసి స్థానిక సమస్యలపైన వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ముఖ్యంగా కాజీపేట బస్టాండ్, కాజీపేట పట్టణాన్ని రైల్వే డివిజన్ గా ఏర్పాటు చేయాలని,వ్యాగన్ మ్యాను ఫ్యక్చరింగ్ యునిట్ సామర్థ్యం పెంచి, యూనిట్‌ని త్వరితగతిన పూర్తి చేయాలని,కాజీపేట-సికింద్రాబాద్ మూడవ లైను పూర్తి పూర్తిచేయాలని,కాజీపేట నుండి వివిధ ప్రాంతాలకు కొత్త రైలు వేయాలని, కాజీపేటలో ఐటీఐ అప్రెంటిస్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాలపై సానుకూలంగా స్పందించి ప్రజల డిమాండ్లను తీర్చే విధంగా కృషిచేస్తే మావంతు సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, టిపిసిసి కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ అభివృద్ధికి కడియం కావ్యను గెలిపించాలి

- ఎన్ఎస్‌యూఐ జాతీయ సెక్రెటరీ నితీష్ చౌదరి



నవతెలంగాణ-హన్మకొండ

వరంగల్ అభివద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి నితిస్ చౌదరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హన్మకొండ హంటర్ రోడ్డు లోని డీకన్వెన్షన్ లో ఎన్ఎస్‌యూఐ పార్లమెంట్ స్థాయి సన్నాహ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కే.ఆర్ నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ, ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర అధ్య క్షులు బల్మూరి వెంకట్, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా నితీష్ చౌదరి మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో యువతతోనే మార్పునకు నాంది పలకాలని కోరారు.ఆంధ్ర నాయకత్వం కంటే ఎక్కువ రాష్ట్ర వనరులు కెసిఆర్ పాలనా దోపిడీకి గురయ్యాయని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులం, మతం ఆధారంగా వర్గాలుగా ప్రజలను చీల్చే కుట్రలు చేస్తోందని అన్నారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఓటమే లేదని విర్రవీగిన ఎర్రబెల్లి ఓటమిలో యశశ్విని గెలుపులో యువత కీలక పాత్ర పోషించారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న వాటిని ఊడబీకుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మితే రిజర్వేషన్ వ్యవస్థను రద్దుచేసే కుట్రలు బీజేపీ చేస్తోందని ఆరోపించారు. బీజేపీ మతవిద్వేషం రెచ్చగొడుతుంటే... రాహుల్ గాంధీ ప్రేమను పంచుతున్నారన్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో దళిత, క్రిస్టియన్, ముస్లిం, మహిళలకు రక్షణ లేదని కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దు చేస్తామని చెబుతున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజలంతా స్వేచ్ఛ, స్వతంత్ర ఉండాలంటే బీజేపీ ఓడిపోవాలన్నారు. ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ మాట్లాడుతూ కడియం కావ్య గురించి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా భూములు కబ్జా పెట్టడానికి పోటీ చేస్తున్న ఆరూరి రమేష్‌ను ఓడించాలని కోరారు.పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి మాట్లాడుతూ ఈడీ, సిబిఐని అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష పార్టీలను కేసులతో ఇబ్బందులు పెడుతోందని అన్నారు. నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ యువత, మహిళలకు కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తుందని బీఆర్ఎస్ పని ఖతమైందని ఇక బీజేపీ పని పట్టాలని అన్నారు. వరంగల్ కు కాజీపేట్ వెన్నముఖ అని నిర్లక్ష్యం చేసింది బీజేపీ, బీఆర్ఎస్ పాలకులేనని బీజేపీ, బీఆర్ఎస్ కు ఓటు అడిగే అర్హత లేదని అన్నారు.

వరంగల్ పార్లమెంటు అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ విద్వేష, విధ్వంస పాలనను అంతమొందించే సత్తా యువత కే ఉందని వరంగల్ అభి వృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఇంచార్జీ రేవూరిప్రకాష్‌రెడ్డి మా ట్లాడుతూ తెలంగాణలో యువత అధిక సంఖ్యలో ఉన్నారని రాజకీయంలో యువతకు అవకాశాలు కేవలం కాంగ్రెస్ లోనే సాధ్యమని వరంగల్ అభివద్ధి జరగాలి అంటే కావ్య ను గెలిపించాలని కోరారు.

మాటలతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : గండ్ర



నవతెలంగాణ-శాయంపేట

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని ఉచిత హామీలు గుప్పించి, అధికారం చేపట్టి నాలుగునెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాటలతోనే కాలయాపన చేస్తుందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. పరకాల పట్టణంలోని జీఎంఆర్‌గార్డెన్‌లో మంగళవారం శాయంపేట మండల బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ మండల అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గండ జ్యోతితో కలిసి మాజీ ఎమ్మెల్యే గండ్ర పాల్గొని మాట్లాడారు. ముందుగా తెలంగాణ ఉద్యమకారుడు జలుగూరి రవీందర్ ఆకస్మిక మరణాన్ని చింతిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రజాపాలనకు రెఫరెండం అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని, అధికారం చేపట్టి 120 రోజులు గడుస్తున్న రెండు లక్షల రుణ మాఫీ, వరికి 500 బోనస్, మహాలక్ష్మి పథకంలో 2500 మహిళలకుపంపిణీ, 15,000 రైతు భరోసాలో రైతులకు పెట్టుబడి సాయం, 4000 పింఛన్లు, ఇందిరమ్మ ఇల్లువంటి పథకాలు ఇప్పటివరకు అమలు చేయకుండా తుపాకి రాముడులా సీఎం రేవంత్‌రెడ్డి గారడి మాటలు చెబుతున్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రామ్‌శెట్టిలతా లక్ష్మారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కుసుమ శరత్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు రాజిరెడ్డి, పోతూ సుమలత రమణారెడ్డి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, ఎంపిటిసిలు మేకల శ్రీనివాస్, గొట్టిముక్కల స్వాతి విష్ణు, మండలకో-ఆప్షన్ సభ్యులు ఎండి మొహిబుద్దీన్, గుర్రం రవీందర్, గంట శ్యాం సుందర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలు కనీస ప్రమాణాలు పాటించాలి

- ఈనెల 22 నుంచి 28 వరకు సంరక్షణ కేంద్రాల తనిఖీ
- హనుమకొండ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



నవతెలంగాణ-సుబేదారి

జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ కనీస ప్రమాణాలు పాటించాలనీ అదనపు కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. మంగళవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ అధ్యక్షత జరిగింది. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ మాట్లాడు తూ బాలసంరక్షణ కేంద్రాలనిర్వాహకులు ఆశ్రయం పొందుతున్న బాలబాలికలకు వసతి, భోజనం, విద్యా, వైద్యంతో పాటు సరైన వసతులు కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోబోయే చర్యల గురించి వివిధశాఖల టోల్ ఫ్రీనెంబర్లను డిస్ప్లే చేయాలని సూచించారు. ఇటీవల నాలుగైదు బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేయగా వాటిలో సరైన వసతులు లేకుండా నిర్వహిస్తున్న సంస్థలు తన దృష్టికి వచ్చాయన్నారు. లైట్స్ లేకుండా, టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉన్నాయని, హెల్త్ ప్రొఫైల్స్ సరిగా లేవని వాటిని సరిచేసుకోవాలని అన్నారు.

ఈ నెల 22 నుండి 28 వరకు జిల్లాలోని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్, ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఈలోగా ఆయా సంస్థల, కొత్తగా ఏర్పాటు చేయబోయే సంస్థలకు వారి కనీస ప్రమాణాలు సంతృప్తికరంగా ఉంటేనే రెన్యువల్ చేస్తామని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ మాట్లాడుతూ హెల్త్ ప్రొఫైల్స్ కు సంబంధించిన ఫార్మాట్ ను జిల్లా వైద్యఆరోగ్య శాఖ సమన్వయంతో రూపొందించి అన్ని సంస్థలు ఒకే విధంగా హెల్త్ ప్రొఫై ల్స్ నిర్వహించుటకు సులువుగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకుంటామని, అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంబంధిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి బాలల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటామని అన్నారు.

అడిషనల్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మదన్ మోహన్ రావు మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల అధికారులకు సమాచారం అందించి బాలల సంరక్షణ కేంద్రాల బాల బాలికలకు హెల్త్ ప్రొఫైల్ నిర్వహించుటకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ వైవి.గణేష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు నందసాని రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ పరికి సుధాకర్, కజాంపురం దామోదర్, పిన్నింటి హైమావతి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు ఎస్.ప్రవీణ్ కుమార్, ఎం మౌనిక, ఎల్పీపిఓ సతీష్ కుమార్, శిశు గహ మేనేజర్ డి. నగేష్, బాలసదనం సూపరింటెండెంట్ కల్యాణి, సోషల్ వర్కర్లు జి.సునీత, ఎం. శ్రీనివాసులు, కౌన్సిలర్ మాధవి, ఓఆర్డబ్ల్యు పి. విజయ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అందని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు



నవతెలంగాణ-ఆత్మకూర్

అర్హులకు అందని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు.. వెనుకబాటుకు గురవుతున్న బడుగు బలహీన వర్గాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరిస్తేనే నిరుపేదల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ సామాజిక ఆర్థిక వేత్త ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని మత్స్యశాఖ సొసైటీ చైర్మన్ బయ్య తిరుపతి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్ నారాయణ మాట్లాడుతూ ఆర్థికఅంశాల కంటే ముందున్న పార్లమెంటు ఎన్నికల లో ప్రభుత్వాలకు తగిన దిశా నిర్దేశించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనేక గ్రామాలలో యువతి యువకులు బతుకుదెరువు లేక హైదరాబాద్ లాంటి నగరాలకు వలస వెళుతుండడంతో గ్రామాలు వట్టిపోతున్నాయి. పేద వర్గాలకు ఉపాధి ఉద్యోగాలు ఆదాయం సమకూర్చే ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా అమ్మడం జరుగుతున్నది.. జాతీయ రహదారుల నిర్మించడానికి రైతుల భూములకు తగిన నష్టపరిహారం వారి బతుకుతెరువు కొరకు ఎలాంటి క్రియాశీలక చర్యలు చేపట్టకపోవడం హృదయ విధారకమని ఆందోళన చెందారు. తెలంగాణ జిల్లాలో ఏ ఒక్క కేంద్ర పరిశ్రమ రాకపోవడం శోచనీయమన్నారు.

ధరల పెరుగుదల వలన పేద మధ్యతరగతి ప్రజలు కనీస అవసరాలను తీర్చుకోలేని దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా దేశ ప్రజల ముఖ్యంగా పేద వర్గాల సామాజిక ఆర్థిక అభివద్ధి తీరుతన్నుల గురించి బుద్ధి జీవులు విద్యావంతులు కార్మిక కర్షకులు విశ్లేషణాత్మకంగా చర్చించి ఎన్నికలలో ఓట్లు వేయాలన్నారు. అత్యధిక మెజారిటీ అయిన పేద ప్రజల ఆర్థిక సామాజిక సమస్యలను ఎన్నికల సందర్భంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని హితవుపలికారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, యూత్ నాయకులు మాదాసి శ్రీధర్, బయ్య తిరుపతి, తనుగుల సందీప్, మార్త కేదారి, గుర్రం రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఎఫ్ కో-ఆప్షన్ సభ్యులుగా సీఏ పీవీ.నారాయణరావు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఐసిఏఐఎస్ఐఆర్‌సిలో పబ్లిక్ అండ్ గవర్నమెంట్ ఫైనాన్సియల్ మేనేజ్ మెంట్ కమిటీ కో-ఆప్షన్ సభ్యులుగా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ సీఏ పీవీ.నారాయణ రావు నిమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు చార్టర్డ్ అకౌంటెంట్స్ పూలబొకేలు, శాలువాలతో అభినందనలు తెలిపారు.



గ్రాడ్యుయేట్ ఎన్నికలపై సమీక్ష



నవతెలంగాణ-సుబేదారి

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలపై నల్గొండలోని కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని వివిధ జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు,ఇతర అధికారులతో రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సిబ్బంది, శిక్షణ కేంద్రాల గుర్తింపు, డిఆర్సి, స్ట్రాంగ్ రూమ్స్, ఎఫ్ఎస్‌టీ, ఎంసీసీ బృందాల ఏర్పాటు, మాస్టర్ ట్రైనర్లు, నోడల్ అధికారుల నియామకం, జోనల్ ఆఫీసర్, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు,రూట్స్, రూట్‌మ్యాప్స్, కావాల్సిన పోలింగ్ సామగ్రి, అవసరమైన వాహనాలు, తదితర అంశాలపై ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నల్గొండ కలెక్టర్ హరిచందన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని జిల్లాల కలెక్టర్ల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుండి జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు డాక్టర్ కె.నారాయణ, ఎన్.వెంకటేష్, ఎన్నికల విభాగం అధికారులు ప్రసాద రావు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో యువకుడి మృతి



నవతెలంగాణ-ఐనవోలు (హనుమకొండ)

ఎండతీవ్రత తాళలేక తీవ్ర అస్వస్థతకు గురైన యువకుడు మృతిచెందిన సంఘటన ఐనవోలు మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఐనవోలులోని నిరుపేద దళిత కుటుంబానికి చెందిన కందిక కృష్ణ (31) అనే యువకుడు దినసరి కూలీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రోజువారిగా సోమవారం కూలీపనులకు వెళ్లాడు. ఎండతీవ్రతతో డీహైడ్రేషన్‌కు గురై తీవ్రఅస్వస్థతకు గురయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన కృష్ణ పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు 108లో చికిత్సనిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ఐదేళ్లలోపు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని దళిత సంఘాల నాయకులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యర్థాలతో దుర్గంధభరితంగా జాతీయ రహదారి



నవతెలంగాణ-ఆత్మకూరు

ఆత్మకూరు-నీరుకుళ్ళ గ్రామల మధ్య 163 వ జాతీయ రహదారి ప్రక్కన కోడి వ్యర్థాలతో దుర్గంధం వల్ల కంపు కొడుతుంది. రోడ్డుపై వెళ్ళు వాహన చోధకులు బరించలేని వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని చికెన్‌సెంటర్‌లో యాజమాన్యం రాహదారిపై కోడివ్యర్థాలు వేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యర్థాలతో తీవ్రదుర్గంధ్ధం వెళువడుతుంది. దీంతో రోడ్డుమీద వెళ్లాలంటే వాసనతో ముక్కుమూసుకో వా ల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు తెలిపారు. సంబంధిత అధికారులు జాతీయ రహదారి ప్రక్కన కోడి వ్యర్థాలు తొలగించి, రహదారి ప్రక్కన వ్య ర్థా లు వేయకుండా తగినచర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

చిట్టీల పేరుతో మోసం చేసిన మహిళ అరెస్టు

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

చిట్‌ఫండ్ చట్టానికి వ్యతిరేకంగా చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాధితుడు కొండపల్లి రవీందర్ ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం మేక కవిత అనే మహిళ వద్దరవీందర్ రూ. 5లక్షల చిట్టీ వేయగా నిర్ణీత గడువు పూర్తయినా డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ మోసం చేసినట్లు పేర్కొన్నారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరిపి మేకే కవితను జ్యూడిషియల్ రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-లింగాలఘనపురం



మండలంలోని సిరిపురం గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఈఆర్పీ (ఐకెపి) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రెవెన్యూ రోహిత్ సింగ్ మంగళవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లలో చేపడుతున్న చర్యలపై ఆరాతీశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. వీరి వెంట తహసిల్దార్ వినయలత, ఏపీఎం శంకరయ్య, సిసి శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శంకర్, కొనుగోలు కమిటీ సభ్యులు రాధిక, లలిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జనగామ విద్యార్థికి సివిల్ సర్వీస్‌లో అత్యుత్తమ ర్యాంకు

నవతెలంగాణ-జనగామ



జనగామ పట్టణానికి చెందిన మెరుగు కౌశిక్ సివిల్ సర్వీస్ సెస్ 81 వ ర్యాంకు సాధించి తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచాడు. అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. జనగామ పట్టణంలోని వ్యాపారవేత్త సుభాంజలి డ్రెస్సెస్‌కు చెందిన మెరుగు సుజాత- సుధాకర్ దంపతుల పుత్రుడైన మెరుగు కౌశిక్ మొదటి ప్రయత్నంలోనే అత్యుత్తమ ర్యాంకును సాధించాడు. పట్టణంలోని సెయింట్ పాల్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసి అనంతరంపై తరగతులకు సెయింట్ జోసెఫ్ హైస్కూల్ హబ్సిగూడలో హైస్కూల్ విద్య పూర్తి చేశారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసి ఢిల్లీలోని ఐఏఎఫ్టిలో సివిల్ కోచింగ్ తీసుకొని మొదటి ప్రయత్నంలోనే 81 సాధించి తెలంగాణలోనే మొదటి స్థాయిలో నిలిచి ఐఏఎస్‌కి సెలెక్ట్ అయ్యాడు. ఈ సందర్భంగా ర్యాంకు సాధించిన కౌశిక్‌కు బాలాజీ నగర్ రేణుక ఎల్లమ్మ గుడి కాలనీవాసులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

స్టేషన్‌ఘనపూర్‌కు ఉపఎన్నిక ఖాయం

- పదవులనుభవించి... మోసం చేసిన కడియం
- వాయిదాలతో కాంగ్రెస్ పరిపాలన
- పార్లమెంటు ఎన్నికలో బీఆర్ఎస్ మెజార్టీ
- మాజీ మంత్రి ఎర్రబెల్లి, జనగామ ఎమ్మెల్యే పల్లా

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



ఆరు నెలల్లో ఘనపూర్‌కు ఉపఎన్నిక రావడం ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జోస్యం చెప్పారు. మంగళవారం నియోజక వర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జనగామ ఎమ్మెల్యే, ఇన్చార్జి పల్లా రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ రాజకీయాల్లో ఇంతటి మోసం చేసిన వ్యక్తి ఒక్క కడియం శ్రీహరిని మాత్రమే చూశానన్నారు. కష్టమొస్తే ఆదుకున్నది మర్చిపోయి, మనకు కష్టమొచ్చినపుడు వెళితే మీరు ఎవరో ఉండేనని కడియం అంటారని, తను చాలా అవస్థలు పడినట్లు తెలిపారు. పాలకుర్తిలో చిన్న అమ్మాయితో ఓడిపోయాడని అంటున్న కడియం తాను వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, ఒక్కసారి మాత్రమేనని,నాలుగు సార్లు ఓడిపోయిన కడియం సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడని అన్నారు. వైయస్సార్ హయాంలో, ఉద్యమ సమయంలో సైతం గెలిచానని, ఏదో గాడుపులో గెలిచి, ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తాటికొండ, పల్లా వల్ల గెలిచిన కడియం విశ్వాసం మరిచి, గెలిచిన తర్వాత రాజయ్యను ఇబ్బందులు గురిచేస్తున్న సంగతి అందరికి తెలుసన్నారు. కేసీఆర్‌పై ప్రజల్లో నమ్మకం ఉందని, ఊరికి పదిమంది కార్యకర్తలను కాపాడితే, రానున్న రోజుల్లో మళ్లీ గులాబీ పార్టీయే అధికారంలోకి వస్తుందని అన్నారు. పార్టీని, నియోజక వర్గ ప్రజలని మోసం చేసిన కడియంకు రానున్న ఎన్నికల్లో ఓడిద్దామనే కసితో ప్రజలున్నారని అన్నారు. కాంగ్రెస్ పరిపాలన రాగానే రాష్ట్రఆదాయం పడిపోయిందని, గతంలో భూములకు ధరలు ఉండేవని, ప్రస్తుతం ధరలు పడిపోయాయని ఆదాయం లేకుండా పోయిందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని కాంగ్రెస్ చెప్పిన ఏ ఒక్క స్కీం కూడా ముందుకు సాగదని, సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తూ, వాయిదాలు వేస్తూ బోగస్ మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. రైతుబంధు పెంచేది లేదు...పాత పద్ధతిలో వేసింది లేదు.. వరిధాన్యానికి బోనస్ రూ. 500 ఇవ్వకుండా, రూ. 2లక్షల రుణమాఫీ చేయకుండా రైతులకు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, ఒక్క మహిళా ఉచిత ప్రయాణ సదుపాయం, మరో రెండు నెలల్లో మూతపడుతుందని అన్నారు. ప్రభుత్వాన్ని మేం పడగొట్టేది కాదు... బిజెపియే పడగొట్టే సమయం దగ్గర్లోనే ఉన్నదన్నారు. ఎమ్మెల్యేగా రాజయ్య నియోజకవర్గం అభివృద్ధికి రోడ్లు మంజూరి, దళిత బంధుకు అడ్డుపడింది కడియమే అన్నారు. అభివృద్ధి కోసం పార్టీ మారననంటున్న కడియంకు సిగ్గుండాలని, దమ్ము, విశ్వాసముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, ఎమ్మెల్యేగా నిలబడి, అప్పుడు ఘనపూర్ ప్రజలు తీర్పుస్తారని అన్నారు. గత పనుల బిల్లులకు ఇబ్బంది పెట్టినా, అక్రమ కేసులు పెడతామని బెదిరిస్తే ప్రజల పక్షాన పోరాడుతామని, ఎవరి జాగీరు కాదని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి పోయిన బాధపడని రాజయ్య, కాస్త ఇబ్బందితో ఎమ్మెల్యేగా, ఎంపీగా టిక్కెట్లు ఇవ్వాలని అవకాశం రాకపోవడంతో బాధగా అటు ఇటుగా ఆలోచించాడే తప్ప, పార్టీ మారే ఉద్దేశం తనకు లేదన్నారు.

ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ స్టేషన్‌ఘనపూర్ గడ్డకు ఓచరిత్ర ఉందని, తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడి, ఎదిరించే చరిత్ర,తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను త్యాగం చేసిన చరితగలదని, ఇన్ని పార్టీలు మారిన కడియంను ఊసరవెల్లిని పోల్చితే సిగ్గుపడుతుందని, ఊసరవెల్లికి కూడా క్షమాపణ చెప్పాల్సి వస్తుందని, నియోజకవర్గ ప్రజల ఆత్మభిమానాన్ని దెబ్బకొట్టాడని, ఉద్యమ నాయకులు డాక్టర్ సుధీర్ కుమార్ ను భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మన్ బండా ప్రకాష్, మాజీ ఎమ్మెల్యే రాజయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎడవెల్లి క్రిష్ణారెడ్డి, ఎంపిపి కవిత, జడ్పిటీసీ సరిత, నాయకులు ఆకుల కుమార్, అక్కనపల్లి బాలరాజు, ఏనుగుల రాకేష్ రెడ్డి, సెవెల్లి సంపత్, కేశిరెడ్డి మనోజ్ రెడ్డి, మండలాధ్యక్షులు మాచర్ల గణేష్, వారాల రమేష్ యాదవ్, చల్లా చందర్ రెడ్డి, జనగాం యాదగిరి, రాజ్ కుమార్, గూడ కిరణ్, లోడెం రవీందర్, పొన్నం రంజిత్, భాగ్యలక్ష్మి, మడ్లపల్లి సునీత, పావని తదితరులు పాల్గొన్నారు.



చామల కిరణ్ గెలుపుకి కృషి చేస్తాం

- జనగామ పట్టణ కురుమ సంఘం నాయకులు

నవతెలంగాణ-జనగామ

భువనగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపుకు కృషి చేస్తామని జనగామ పట్టణ కురుమ సంఘం నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జనగామ పట్టణ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జనగామ కురుమ సంఘం, బిల్డింగ్ కాంట్రాక్టు అసోసియేషన్ అధ్యక్షులు బాల్దె మల్లేశం, యేంద్రు వైకుంఠం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక కర్షక బడుగు బలహీన వర్గాలను ఆదుకున్నది కాంగ్రెస్ పార్టీని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెంటీలు విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చాముల కిరణ్ కుమార్ రెడ్డికి కురుమ సంఘం బంధువుల అండ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కురుమ సంఘం పట్టణ నాయకులు కే. శ్రీనివాస్, గాదరి సిద్ధ రాములు, రేవెళ్లి రామచందర్, గాదరి పవన్ కళ్యాణ్, సాయికిరణ్, ప్రవీణ్, గవ్వల శ్రీను, కెమిడి ఉపేందర్, బాల్దె మైసయ్య, గవ్వల శ్రీనివాస్, బర్ల సిద్ధులు, బాల్దె శ్రీశైలం, అయిల రాములు, తోటకూరి మైసయ్య, బేజాడి కేశవులు, జట్ట యాదగిరి, బుగ్గ నర్సింహులు, బాల్దె సత్తయ్య, బాలయ్య, శ్రీను, కర్ర వెంకటేష్, గాదరి కృష్ణ, పరశురాములు, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ నవమికి సర్వం సిద్ధం

నవతెలంగాణ-లింగాలగణపురం

మండలంలోని నవాబుపేట గ్రామ అంగడిలో కొలుదీరైఉన్న శ్రీ కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలో రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీ వీరాచల జిడికంటి శ్రీ రామచంద్రస్వామి ఆలయంలో నేడు జరిగే శ్రీరామనవమి సందర్భంగా అధికారులు, ఆలయ అర్చకులు స్వామి వారి కళ్యాణ మహోత్సవాలకు సర్వసిద్ధం చేశారు. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం గరుడసేవ పేరుతో దేవుని కళ్యాణానికి అంకురార్పణ చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, వైద్య సిబ్బందిని నియమించారు. కళ్యాణంలో భాగంగా పుట్టమన్ను తీసుకురావడం, ఎదుర్కోలు తదితర ప్రధాన ఘట్టాలు ఉంటాయని ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహచార్యులు, కృష్ణమూర్తి తెలిపారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి లక్ష్మీ ప్రసన్న, దేవాదాయ శాఖ ఉద్యోగులు కుర్రెముల మోహన్ గౌడ్, ఎల్లా గౌడ్, రమేష్, సరోజన, వసంత తదితరులు దగ్గరుండి శ్రీరామనవమి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పరిసర గ్రామాల ప్రజలు కళ్యాణానికి హాజరవుతారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన వీరన్న

నవతెలంగాణ-లింగాలఘనపురం



మాజీ సీఎం కేసీఆర్‌ను తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఏదునూరి వీరన్న మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి దశనుంచి పార్టీకి వివిధ హోదాలలో పనిచేసిన తీరును తన రాజకీయ ప్రస్తానం, జనగామ జిల్లా రజకులకు చేసిన సేవలను కేసీఆర్‌కు వివరించారు. నేటి యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-లింగాలగణపురం



మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ చీటకొరు సంపత్ నానమ్మ (పోచమ్మ) గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఎల్లమ్మ-సంజీవులు తల్లి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. జనగామ జిల్లా కాంగ్రెస్ నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి పోచమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిడికల్ దేవస్థానం చైర్మన్ ఎలా మూర్తి, దేవస్థాన డైరెక్టర్ నరేష్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొత్త అంజయ్య, గ్రామ నాయకులు సత్తి, యూత్ నాయకులు చింటు, చందు, సుకుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ మండల ఇంచార్జ్ బూడిది సదానందం గౌడ్ నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కొల్లూరి శివకుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దీలిప్ రెడ్డి, నీలం మోహన్, కుందారం ఎంపీటీసీ రజిత ఉపేందర్, ఓబీసీ మండలాధ్యక్షులు బండ రమేష్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నర్సింగ రమేష్, జీడికల్ దేవస్థాన డైరెక్టర్ బస్వాగని నరేష్, మండల నాయకులు ధీకొండ రాజు, మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరాయ రాజు, జీడికల్ యూత్ వైస్ ప్రెసిడెంట్ ఓర్స్ నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

ధాన్యం ఆరోబోస్తే చర్యలు తప్పవు : ఎస్ఐ

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్



పాలకుర్తి మండల పరిధి రైతులు రోడ్లపై వరి ధాన్యం ఆరబెడుతున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. రైతులు ఎవరు కూడా వడ్లు ఎండబెట్టడానికి రోడ్లపై పోయరాదని, ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే దానికి కారణమైన రైతులపై చట్టపరమైన చర్యలుతీసుకుంటామని పాలకుర్తి ఎస్ఐ ఎం. సాయి ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

హోంగార్డ్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్



మండలంలోని లక్ష్మీనారాయణ గ్రామానికి చెందిన బండిపెల్లి మారయ్య పాలకుర్తి పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తల్లి అయిన లక్ష్మీ సోమవారం అనారోగ్య కారణాలతో మృతి చెందగా పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి, ఎస్‌హెచ్ఓ ప్రసన్న కుమార్ ఆదేశాలతో పాలకుర్తి రెండవ ఎస్ఐ లింగారెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులు బండిపెల్లి కొండయ్య, యాదగిరి, రమేష్ పరామర్శించారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మాజీ గ్రామ సర్పంచ్ గిలకత్తుల సుధాకర్, బండిపెల్లి సోమనర్సయ్య తదితరులున్నారు.

జహంగీర్‌ను గెలిపించండి : సీపీఎం





నవతెలంగాణ-జనగామ

పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి నియోజవర్గం నుండి సీపీఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు రాపర్తి రాజు కోరారు. మంగళవారం జనగామ పట్టణంలోని అంబేద్కర్ నగర్, గురుద్వార్ కాలనీలలో ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతంగ పోరాటానికి కేంద్ర బిందువైన భువనగిరి నియోజకవర్గం నుండి పార్లమెంటులో ఎర్రజెండా ప్రాతినిథ్యం ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశంలో బీజేపీ అనుసరిస్తున్న కార్పొరేట్ మతోన్మాద విధానాలపై నికరంగా ఉద్యమిస్తున్న పార్టీ సీపీఎం అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలని భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని బిజెపి మతోన్మాదాన్ని ఎన్నికల్లో ఓడించాలని కోరారు. ప్రజల కోసం అనునిత్యం పోరాడుతున్న ప్రజల పార్టీ అని, సీపీఎం అభ్యర్థిని గెలిపిస్తే పార్లమెంటులో ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్య చందు నాయక్, పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, బాల్న వెంకట మల్లు, కే.రాజు, ఎం.జయ, ఎర్ర రజిత, ఆనంద్ కోర్, మహేశ్వరి, సమ్మక్క, గంగాకోర్ మీనా,కోర్ గీతా పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు వేలాదిగా తరలిరండి :

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవీ రమణ

బచ్చన్నపేట : భువనగిరి పార్లమెంటు సీపీఎం అభ్యర్థి ఎండి జహంగీర్ నామినేషన్‌కు వేలాదిగా తరలిరావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవీ రమణ పిలుపు నిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం రామగళ్ల అశోక్ అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా రమణ హాజరై మాట్లాడుతూ నిస్వార్థంగా నీతి నిజాయితీతో కూడిన రాజకీయాలు చేస్తూ ప్రజల మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి జహంగీర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన అమరవీరుల స్ఫూర్తితో కమ్యూనిస్టులను పార్లమెంటుకు పంపాలని, పోరాటాల అడ్డ భువనగిరి కోటపై ఎర్రజెండా ఎగర వేయాలని ఎండి జహంగీర్ సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. 19న జరిగే నామినేషన్ కార్యక్రమానికి మండల ప్రజలు వేలాదిగా తరలి రావాలని వారు ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, మండల నాయకులు తాడేం రాములు, పర్వతం నర్సింహులు, సమ్మయ్య, బాలరాజు, మనోహర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు

నవతెలంగాణ-జనగామ

జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ వర్కర్స్‌కు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్లో హౌస్‌కీపింగ్ వర్కర్లలు కలెక్టరేట్ ఏవో రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో చాలీచాలని వేతనాలతో శానిటేషన్ పనులు చేస్తున్న హౌస్ కీపింగ్ వర్కర్స్‌కు నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సంబంధిత ఏజెన్సీ కాంట్రాక్టర్ ప్రభుత్వం బిల్లులు ఇస్తేనే మేము మీకు వేతనాలు చెల్లిస్తామని నాలుగు నెలల నుండి వేతనాలు ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. గతంలో ఉన్న ఏజెన్సీ కాంట్రాక్టర్ సైతం మూడు నెలల వేతనాలు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారని వాటినిసైతం ఇవ్వాలని కోరారు. వివిధ డిపార్ట్మెంట్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. కనీస వేతనం నెలకు రూ. 26,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే పెండింగ్ వేతనాలు అందించేలా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ కార్మికులు టీ.మహేశ్వరి,పి.కృష్ణవేణి,జి.సరిత, పి.స్వప్న లావణ్య, మహబూబి, సబిత, అమీనా తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-తరిగొప్పుల



మండల కేంద్రానికి చెందిన చెన్నూరి మహిపాల్ ఆధ్వర్యంలో ఉచితంగా చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్ఎస్ టిఫిన్ సెంటర్ ఎదురుగా ప్రజలకు, వాహనదారులకు, పాదచారులకు మజ్జిగ అందజేశారు. వేసవిలో విపరీతంగా కాస్తున్న ఎండలు,పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో పంపిణీ చేసినట్లు మహిపాల్ తెలిపారు. వేసవి తపానికి తట్టుకోలేక ప్రజలు చల్లటి మజ్జిగ తాగేందుకు బారులు తీరారు. విజయవంతంగా నడిపించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతం పొలు, చెన్నూరి సురేష్, రమేష్, సామ్యూల్, సందీప్, రిపోర్టర్ రమేష్, శేఖర్, నవీన్, సంజీవ, జాన్సన్, మండల ప్రజలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకం

- భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకం అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్, డీసీపీ సీతారాంలతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్, 1994పై ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లు, అసోసియేషన్ అధ్యక్షులు, పీఓలు, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, సూపరింటెండెంట్‌లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మల్టీ మెంబర్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ ప్రకారం భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, సహకరించిన వారికి జైలు శిక్ష, జరిమానా విధించడం జరుగుతుందన్నారు. గ్రామ,మండల స్థాయిలో ప్రజలకు లింగ నిష్పత్తిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఆసుపత్రిలో, స్కానింగ్ సెంటర్లలో ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేసి ఈ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయిలో ప్రత్యేక టీంలను నియమించాలని, పీవోలు, డిప్యూటీ డీఎంహెచ్ఓలు ప్రతి ఆసుపత్రిని పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి ఆసుపత్రిలో రిజిస్టర్‌లను సరైన విధంగా నిర్వహించాలని, రిజిస్ట్రేషన్ లేని క్లినిక్ లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఆసుపత్రిలో సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్, ఎన్ఓసీని కచ్చితంగా తీసుకోవాలని అన్నారు. అన్ని పీహెచ్సీలు, సీహెచ్సీలలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రసూతి మరణాలు, పిల్లల మరణాలు ఎక్కడ కూడా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాంటి సంఘటనలు ఎదురైతే సంబంధిత ఆసుపత్రిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రుల్లో లేబర్ రూంలను, రక్త నిల్వలను, రక్తదాన శిబిరాలను ఉండాలని పేర్కొన్నారు. పీవోలు, డిప్యూటీ డీఎంహెచ్ఓలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారు, భ్రూణ హత్యలు చేసే వారి గుర్తించి ఫిర్యాదు చేయడానికి 104, 1098 టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు. లింగ ఎంపిక నిషేధ చట్టంపై అవగాహన కల్పించేందుకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ హరీష్ రాజ్, డీసీహెచ్ఎస్ సుగుణాకర్ రాజు, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, పీఓలు, మెడికల్ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లు, అసోసియేషన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ ఎన్నికలకు సర్వం సిద్ధం : కలెక్టర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేషన్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి చందన ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లా నుంచి సహాయ రిటర్నింగ్ అధికారి 100-పాలకుర్తి అండ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, సహాయ రిటర్నింగ్ అధికారి 99-ఘనపూర్, ఆర్డీఓ వెంకన్నలతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 27 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వీటిలో జనగామ నియోజకవర్గానికి సంబంధించి 17, ఘనపూర్‌కు సంబంధించి 10 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్ల సంఖ్య పురుషులు 14862, మహిళలు 8457, థర్డ్ జెండర్-1తో మొత్తం 23,320 మంది ఓటర్లున్నారని, పకడ్బందీ చర్యలు తీసుకొని, బ్యాలెట్‌బాక్సులు, స్ట్రాంగ్ రూంలను పర్యవేక్షించాలని, అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఈసమావేశంలో ఈడీఎం దుర్గారావు,ఏవో రవీందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎలక్షన్ సెల్ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యేదెన్నడో..!?

పనులు ప్రారంభించి పది నెలలు - పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్



కేంద్ర ప్రభుత్వ నిధులతో గూడూరు నుండి ధర్మాపురం వరకు 20 కిలోమీటర్ల రోడ్డును కేంద్ర ప్రభుత్వ నిధులతో 14కోట్ల రూపాయలతో రెండు సంవత్సరాల క్రితం రోడ్డు విస్తరణ పూర్తి చేశారు. ఈ రోడ్డుపై తిరుమలగిరి బస్టాండ్ వద్ద గత పది నెలల క్రితం బ్రిడ్జి నిర్మాణం కొరకు పనులు మొదలుపెట్టారు. దాదాపు 70 కోట్ల రూపాయల అంచనాతో ప్రత్యేక అభివృద్ధి నిధుల నుండి మొదలుపెట్టిన పనులు నత్తనడకగా సాగుతున్నాయి. రోడ్డు బ్రిడ్జిపై పైకప్పు వేసి ఇరువైపులా కంకర పరిచి వదిలిపెట్టారు. బ్రిడ్జికి పైకప్పు వేసి ఆరు నెలలు దాటుతున్నా ఇరువైపులా కంకరపై బీటి వేసి నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్ వదిలిపెట్టారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. గత నెల మొదటి వారంలో ఈ బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో శాతాపురంకు చెందిన కంచర్ల కొమురయ్య, బీరెల్లి వెంకన్న ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిపాలయ్యారు. తరచూ రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్న సంఘటనలు నెలకొంటున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. గత సంవత్సరం జరిగిన సాధారణ అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందు పనులు ఆపి ఇంతవరకు పనులు మొదలు పెట్టకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్ వెంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ డిఈ రామలింగయ్య చారిని వివరాలు అడగగా బిల్లులు చెల్లింపులులో ఆలస్యమవుతుందని పేర్కొన్నారు. పనులు చేయుటలో ఆలస్యం జరుగుతుందని అన్నారు.

కావ్య గెలుపే లక్ష్యం

- చిల్పూర్ ఎంపీపీ

బొమ్మిశెట్టి సరితాబాలరాజు

నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్

వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గ అభ్యర్థి కడియం కావ్య గెలుపే లక్ష్యంగా పని చేస్తామని చిల్పూర్ ఎంపీపీ బొమ్మిశెట్టి సరితాబాలరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థి, నియోజక వర్గ అభివృద్ధి ప్రధాత కడియం శ్రీహరి తనయురాలు కడియం కావ్య గెలుపు ఖరారు అయిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ప్రజలకు మేలు చేస్తాయన్నారు. అత్యధిక మెజార్టీతో కడియం కావ్యను గెలిపించుకుందామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై సీపీఎం వినతి

నవతెలంగాణ-మహబూబాబాద్



పట్టణంలోని 15వ వార్డులోని దేవి ప్రసాద్ నగర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు మోటర్ ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ పైప్ లైన్ నిర్మించాలని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు రావుల రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీరు లేక కాలనీ ప్రజలు అల్లాడిపోతున్నారని, రోజువారి అవసరాలకు కూడా నీరు అందడంలేదని, కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని అన్నారు.మున్సిపల్ అధికారులు స్పందించివెంటనే త్రాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరి ప్రసాద్ నగర్ కాలనీ అధ్యక్షులు బొమ్మెర నగేష్, గుమాకర్, అల్లి కృష్ణ, భూపతి శ్రీను, కాలనీ యూత్ లీడర్స్ కైలాసకోటి శేఖర్, ఆకుల శేఖర్, సుంకరి వెంకటేష్, దొంతర పోయిన వినయ్, గొడుగు కుమార్, వన్నాల చందు, ఎస్కే సాకీర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-తొర్రూరు



పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం దేవరుప్పల మండలానికి చెందిన సుమారు 50 మంది బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్రంలో నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకే ఈ చేరికలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ఎవరు అధైర్యపడవద్దని, ఎవరికుండే ప్రాధాన్యత వారికుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు నల్ల శ్రీరామ్, మండల ముఖ్యనాయకులు, మాజీ సర్పంచ్ లు, యూత్ నాయకులు, సోషల్ మీడియా మిత్రులు, ముఖ్య నాయకులు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లౌకిక ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిద్దాం

సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

నవతెలంగాణ-మహబూబాబాద్

ఆర్ఎస్ఎస్ బిజెపి మతోన్మాద ఫాసిస్ట్ శక్తులను ఓడించి లౌకిక ప్రజాస్వామిక విలువలను పరిరక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా వామపక్ష పార్టీల సమావేశం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గౌని ఐలయ్య అధ్యక్షతన పెరుమాండ్ల జగన్నాథం బవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బీ.విజయ్ సారథి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు కొత్తపెల్లి రవి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గౌనె కుమారస్వమి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న, ఆకుల రాజు, నందగిరి వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ పార్టీ డివిజన్ కార్యదర్శి హలవత్ లింగన్న రాబోయే పార్లమెంటు లోక్ సభ ఎన్నికలలో మతోన్మాద బిజెపిని ఓడించాలని పిలుపు నిచ్చారు.





అకేరు నుండి అక్రమంగా ఇసుక తరలింపు

నవతెలంగాణ-మరిపెడ

మరిపెడ మండలం భూక్యతండ గ్రామపంచాయతీ పరిధిలోని తేజవత్ తండా సమీపంలోని ఆకేరు వాగు డంపింగ్ నుంచి కొందరు వ్యక్తులు నిత్యం పదుల సంఖ్యలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. వీరారం విస్సంపల్లి, ఉల్లేపల్లి, మరిపెడ బంగ్లా, ఎల్లంపేట తదితర గ్రామాలతో పాటు గిరిజన తండాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు రూ. 5000 వేల చొప్పున తీసుకుంటూ రెండు ట్రాక్టర్ల ద్వారా నిత్యం ఇసుకను తరలిస్తున్నారు. కొందరు అధికారుల అండదండలతో ఇసుక దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. గత రెండు నెలలుగా ఈ అక్రమ ఇసుక దందా మూడు పువ్వులు ఆరుకాయలు కొనసాగిస్తూ లక్షల రూపాయలు దండుకున్నట్లు తెలుస్తుంది. ఇసుక తరలించే ట్రాక్టర్లకు రిజిస్ట్రేషన్ నెంబర్ కూడా లేకపోవడంతో వీరి దందాకు అడ్డు అదుపు లేకుండా కొనసాగుతుంది. ఇద్దరు వ్యక్తులు రెండు నెలల నుంచి ఈ దందాకు తెరలేపినట్లుగా పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వీరి ట్రాక్టర్లు సీజ్ చేయడంతో పాటు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆకేరు వాగు పరివాహక రైతులు డిమాండ్ చేస్తున్నారు.



విద్యను నిర్లక్ష్యం చేస్తున్న రాజకీయ పార్టీలను నిలదీయండి

నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేసి, విద్యా కార్పొరేటీకరణకు అండగా నిలవడంలో అన్ని ప్రధాన రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కనిపిస్తుందని, నాణ్యమైన ఉచిత సమాన విద్య కోసం అలాంటి పార్టీలను ప్రజలు నిలదీయాలని తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ప్రజలకు పిలుపు నిచ్చారు. మంగళవారం టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో విద్యారంగ సమస్యలపై రూపొందించిన విద్యారంగ పీపుల్స్ మేనిఫెస్టోను ఆయన విడుదల చేశారు. అనంతరం చుంచు శ్రీశైలం, భాస్కర్అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సిలబస్ మార్పే సాకుతో చరిత్ర వక్రీకరణ దశను దాటిపోయి, మొత్తంగా చరిత్రనే మార్చేస్తుందని ఆరోపించారు. కొందరికే విద్య అనే నినాదం బీజేపీ సైద్ధాంతిక వాదమని, మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయంచేస్తున్న ఆపార్టీకి వారుపైకి చెప్తున్నట్లు హిందు మత ఉద్ధరణ వారి లక్ష్యం కాదని, ఆ ముసుగులో దేశ వనరులను దోచుకోవడం, బడా వ్యాపారవేత్తలకు దోచిపెట్టడమేనని విమర్శించారు. దేశ భవిష్యత్తును నిర్మించే కీలకమైన విద్య పట్ల ఇతర రాజకీయ పార్టీల చిన్న చూపు నేరమవుతుందని హెచ్చరించారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలో విద్యారంగ మౌలిక అంశాలను చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా నాయకులు బలాస్టి రమేష్, సోమ విష్ణువర్ధన్, చీకటి ఉపేందర్, డీటీఫ్ నాయకుడు ఎస్.ఉపేందర్ రెడ్డి, టీపీటీఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాచకొండ ఉపేందర్, పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను తక్షణమే బదిలీ చేయాలి

ఎస్ఎఫ్ఐ నాయకులు ఎండి అమీర్

నవతెలంగాణ-తొర్రూరు



తొర్రూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బదిలీపై వచ్చిన నూతన ప్రిన్సిపల్ రాములు పేద, బడుగు, బలహీన వర్గాలకు చదువుకు దూరం చేసే కుట్రలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటి సభ్యులు ఎండి అమీర్ ఆరోపించారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకటి, నాలుగు, ఆరవ సెమిస్టర్లకు సంబంధించిన పరీక్ష ఫీజులను కట్టించుకోకుండా స్కాలర్‌షిప్ రాలేదని సాకు చెప్పి డబ్బులు చెల్లించాకే సెమిస్టర్ పరీక్ష ఫీజులు కట్టించుకుంటామని బెదిరించడం సరైన చర్య కాదని అన్నారు. ఎంతో నమ్మకంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత విద్య అందుతుందన్న నమ్మకంతో వచ్చిన విద్యార్థులను ఫీజుల పేరుతో వేధించటం రాబోవు రోజులలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లను తగ్గించడమే వారి కుట్రలో భాగమేనని అన్నారు. పరీక్ష ఫీజులు కట్టించుకోమని విద్యార్థులు ఏం చేసుకుంటారో చేసుకోండి అని చెప్పి కళాశాల ప్రిన్సిపాల్ బెదిరిస్తున్నట్లు విద్యార్థులు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ని బదిలీ చేయాలని లేకుంటే కళాశాల మూతపడే పరిస్థితి నెలకొందని, కార్పొరేట్ ప్రైవేటు డిగ్రీ కళాశాలకు విద్యార్థులు వెళ్లే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

వచ్చే వానాకాలం నుంచి ప్రతీ రైతుకు బీమా

19న బలరాం నాయక్ నామినేషన్

ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-మహబూబాబాద్



తెలంగాణ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రకాల ఆర్థిక వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని దివాలా తీసి రైతాంగని అధోగతిపాలు చేసిందని ప్రజల ఆశలు ఆకాంక్షలు తీర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం జిల్లా అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. అన్ని రంగాలలో దివాలా తీసిన తెలంగాణరాష్ట్రాన్ని పునర్‌నిర్మించేందుకు కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, రాబోయే పార్లమెంటు ఎన్నికలలో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీలో ఉన్న బలరాం నాయక్ నామినేషన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈనెల 19న జిల్లా కేంద్రంలో బలరాం నాయక్ నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పాల్గొంటారని వివరించారు. నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జన తరలింపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని తెలిపారు. గతంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో రాబోయే ప్రభుత్వాలు అన్ని దివాలా తీయాలని పడిపోవాలని ఉద్దేశంతో వ్యవసాయ ఆర్థిక విద్యుత్తు ప్రాజెక్టులను అధోగతి పాలు చేశారని అన్నారు. ఎలాగూ తాము అధికారంలోకి వచ్చే ప్రభుత్వం కూడా త్వరగా పడిపోవాలని విద్యుత్ శాఖను లక్ష కోట్ల అప్పులలో ముంచి వేసిందని అన్నారు. తాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పనికిరాకుండా చేశారని అన్నారు. రైతుల పంటల బీమా పథకాలను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పంట బీమా పథకం ద్వారా రైతులకు పంట సాయం వచ్చేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం మూలంగా రైతులకు సహాయం అందే పరిస్థితి లేదని అన్నారు. రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాబోయే వర్షాకాలం నుంచి పంటల బీమా పథకాన్ని ప్రారంభిస్తుందని తెలిపారు.

అలాగే వచ్చే ఆగస్టు 15 నాటికి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని అన్నారు. సోనియా గాంధీ నేతృత్వంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం , 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేశామని అన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బలరాం నాయక్ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చంద్ర రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ భూక్య మురళి నాయక్, డాక్టర్ తేజావత్ రామచంద్రనాయక్, దొంతి మాధవరెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు ఘనపురం అంజయ్య మండల పార్టీ అధ్యక్షులు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

నవతెలంగాణ-మహబూబాబాద్



లోకసభ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పక్షాలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కోరారు. మంగళవారం కలెక్టర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నామినేషన్ల ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 18 నుండి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ అంశాలపై ఆయన కూలంకుశంగా వివరించారు. లోకసభ ఎన్నికల సందర్భంగా ఈనెల 18 నుండి 25 వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని, 26ననామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్న 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, మధ్యాహ్నం 3 తర్వాత నామినేషన్లు స్వీకరించడం జరగదని ఆయన స్పష్టం చేశారు. నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు వారితోపాటు, అనుమతించే వ్యక్తులు, వాహనాలు, తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. నామినేషన్ వేయడానికి ముందే పోటీ చేసే అభ్యర్థి పేరు మీద ఏదైనా జాతీయ బ్యాంకులో ఎలక్షన్ ఎక్స్పెండిచర్ కోసం కొత్త ఖాతా తెరవాలని ఆయన తెలిపారు. నామినేషన్ల సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 12,500 రూపాయలు, సాధారణ అభ్యర్థులు 25 వేల రూపాయలు సెక్యూరిటీ డిపాజిట్ చేయవలసి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆయన అవగాహన కల్పించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం అభ్యర్థుల ఖరారు తర్వాత ఎన్నికల ఖర్చుల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి, పాటించవలసిన నియమ నిబంధనలు, ప్రజా ప్రతినిధ్య చట్టంపై వివరంగా తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రచురించే కరపత్రాల విషయంలో ప్రజా ప్రతినిధ్య చట్టంలోని 127-ఏ నిబంధనలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుందని తెలిపారు. లోకసభ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు 90 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మార్నేని వెంకన్న, కాంగ్రెస్ నుండి ఎస్.సురేష్ నాయుడు, బిజెపి నుండి అసెంబ్లీ కన్వీనర్ వేముల కోమల్ రెడ్డి, ఎన్నికల పర్యవేక్షణ అధికారి పవన్ కుమార్, సిబ్బంది హరి పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మరిపెడ

అంగన్వాడి కేంద్రాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ శిరిష అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లేపెల్లి సెక్టార్ పరిధిలో లచ్చతండా అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ (ఈసిసిఈ) కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు పోషక నిలయాలని, పోషకాహారంతోనే తల్లిబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బలవర్ధక ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పక తీసుకోవాలని సూచించారు. పౌష్టికారహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలు, పిల్లల ఎదుగుల గురించి తల్లులకు సూచనలు చేశారు. అనంతరం చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పద్మ, అంగన్వాడీ టీచర్లు శాంతి, సుశీల, నీలాబాయి, నాగచంద్ర, ఏఎన్ఎంలు రాములమ్మ పద్మ ఆయాలు, గర్భిణీలు, బాలికలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

నీలుకుర్తి సెక్టార్ పరిధిలో...

మరిపెడ మండలం నీలుకుర్తి సెక్టార్ పరిధిలో మూన్య తండా అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన స్కూల్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ గొల్లపల్లి రాణి ముఖ్యఅతిథిగా హాజరై పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడి టీచర్ గంధసిరి కనకమ్మ ఆయా సార, గర్భిణులు, బాలింతలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవంగర ఎంపీపీగా బొమ్మెరబోయిన కల్పన

నవతెలంగాణ-పెద్దవంగర

పెద్దవంగర మండలపరిషత్ అధ్యక్షురాలుగా అవుతాపురం ఎంపీటీసీ బొమ్మెరబోయిన కల్పన రాజు యాదవ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు గత నెల 5 న ఎంపీపీ ఈదురు రాజేశ్వరి పై అవిశ్వాసం తీర్మానాన్ని ప్రతిపాదించారు. మార్చి 23న నిర్వహించిన అవిశ్వాస పరీక్షలో అవిశ్వాసానికి మద్దతుగా ఆరుగురు ఎంపీటీసీలు ఓటు వేయడంతో ఎంపీపీ పై అవిశ్వాస నెగ్గింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నెల 8 న ఎంపీపీ రాజేశ్వరిని పదవి నుండి తొలగిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో వైస్ ఎంపీపీగా ఉన్న బొమ్మెరబోయిన కల్పన రాజు మండల ఎంపీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

ఎమ్మెల్యే సహకారంతో మండలాభివృద్ధికి కృషి : ఎంపీపీ

పెద్దవంగర ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన బొమ్మెరబోయిన కల్పన రాజు యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తా అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి సమన్వయంతో పని చేస్తూ, మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో ఎక్కడ కూడా తాగునీటి కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుమాధవ్, ఎంపీటీసీ సభ్యులు బానోత్ రవీందర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు బానోత్ సోమన్న నాయక్, ఈరెంటి శ్రీనివాస్, వెంకన్న, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను మరింత పెంచాలి

గార్ల : వసతి గృహలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మరింతగా పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మంగిడి ఎర్రయ్య అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో మెనూ ను, పాఠశాల, వసతి గృహ నిర్వహణ రికార్డు లను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పరీక్షల సందర్భంగా విద్యార్థులకు సబ్జెక్టుల స్టడీ అవర్స్ నిర్వహించాల ని,పరీక్షలు ముగిసిన వెంటనే ఇవల్యూషన్ చేసి మార్కులను రికార్డు లో నమోదు చేయాలని సూచించారు.ప్రస్తుత వేసవికాలంలో విద్యార్థుల ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని ఆశ్రమ పాఠశాల హెచ్‌యం డి.కోటేశ్వరి,ఏ ఎన్ యంలకు సూచించారు.



మూడేళ్లలోనే 30 టన్నుల దిగుబడి

సాంప్రదాయ పంటల స్థానంలో పామాయిల్ సాగు

ఆదర్శంగా నిలుస్తున్న ఆయిల్ ఫామ్ రైతు అంజయ్య

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

ఏటా సాంప్రదాయ పంటల సాగుతో విసిగిపోయిన రైతు తూర్పాటి చిన్న అంజయ్య ఆయిల్ ఫామ్ పంట సాగు చేసి మూడేళ్లలోనే దిగుబడి సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మండల వ్యాప్తంగా 1100 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంట సాగవుతుండగా తొలి దిగుబడిని సాధించాడు. మూడేళ్ల ఆరు నెలల కాలంలో 30 టన్నుల దిగుబడిని సాధించి ఆదర్శంగా నిలిచాడు. మంగళవారం మండలంలోని కంటాయపాలెం శివారులో 30 ఎకరాల్లో సాగుచేసిన ఆయిల్ ఫామ్ పంట దిగుబడిని ఉద్యాన శాఖ డివిజన్ అధికారి రాకేష్‌తో కలిసి రైతు, ఎంపీపీ అంజయ్య చూపించారు. ఈ సందర్భంగా రైతు అంజయ్య మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద 30 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంట సాగు చేశానని, 90 శాతం సబ్సిడీతో డ్రిప్ మొక్కలు అందాయన్నారు. సాగుకై ఎకరాన రూ. 20 వేలు ఖర్చు చేశానని, ఆయిల్ ఫెడ్, ఉద్యాన శాఖల నుంచి సహకారం అందిందని తెలిపారు. అంతర పంటలుగా పత్తి, పెసర, వేరుశనగ పంటలు వేశానని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి పంట దిగుబడి మొదలైందని ఇప్పటివరకు 30 టన్నుల దిగుబడి సాధించినట్లు తెలిపారు. టన్నుకు రూ.14,437 వస్తుందని, ఆయిల్ ఫెడ్ వాళ్లే పంటను అశ్వరావుపేట పరిశ్రమకు తరలిస్తారని తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో ఆయిల్‌పామ్ సాగుచేసే రైతుల కు రాయితీలు ఇస్తోందన్నారు. కంపెనీలు గ్యారెంటీ ధరలతో రైతుల వద్ద దిగుబడులను కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఆయిల్ పాం సాగువైపు దృష్టి సారిస్తున్నారన్నారు. సాంప్రదాయ పంటలైన వరి, పత్తి వంటి పంటలను సాగు చేసి నష్టపోవడం కంటే ఆయిల్ ఫామ్ పంట సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానికులు రాఘవరెడ్డి, సమ్మాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి మాజీ జెడ్పీటీసీ విరాళం

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండలంలోని బేరువాడ గ్రామంలో గిరిజనుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న దుర్గమ్మ గుడికి 2,00,116 రూపాయల విరాళంను కేసముద్రం మాజీ జెడ్పీటీసీ బండారు పద్మ-వెంకన్న అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం దుర్గమ్మ గుడి వద్ద నిర్వహించిన పసుపు, కుంకుమ పూజలకు హాజరై దుర్గమ్మ గుడి కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో బేరువాడ మహిళా, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





పార్టీ బలోపేతానికి కార్యకర్తలే పట్టుకొమ్మలు

ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్

నవతెలంగాణ-గూడూరు

కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు పట్టుకొమ్మలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అన్నారు. మంగళవారం గూడూరు మండలంలో కాంగ్రెస్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిట్ల వెంకన్న ఆధ్వర్యంలో భూపతి పేట కోబల్ తండాల నుండి బిఆర్ఎస్ నుండి పలు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరికల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, డిసిసి అధ్యక్షులు జేన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో మెలగాలని, పార్టీ బలోపేతానికి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని, గ్రూపు రాజకీయాలు చేయకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ క్రమశిక్షణ అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని వారి పైన వేటు తప్పదని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కాంగ్రెస్‌లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, గతంలో బీఆర్ఎస్‌లో అధికారంలోకి ఉండి ఇబ్బందులకు గురిచేసిన ముఖ్య నాయకులను మినహా మిగతా వారందరి కోసం ఎప్పుడూ కాంగ్రెస్ గేట్లు తెరిచే ఉంటుందని అన్నారు. టిఆర్ఎస్‌లో గూడూరు మండలంలో కొందరు ముఖ్య నాయకులు అమాయక ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని వారిని ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీలోకి తీసుకునేది లేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలే ముఖ్యమని నాయకులు అన్నారు. అందరు ఐక్యతతో పార్టీ బలోపే దానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాధవ పెద్ది రమేష్ చందర్ రెడ్డి, మాధవ పెద్ది ప్రదీప్ రెడ్డి, మధు, శ్రీపాల్ రెడ్డి, నరేష్ రెడ్డి, వీరస్వామి, సమ్మక్క, వివిధ గ్రామాల ముఖ్యనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వద్దిరాజు రవిచంద్రకు సన్మానం

నవతెలంగాణ-మహబూబాబాద్



రెండవసారి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా మహబూబాబాద్‌కి వచ్చిన ఎంపీ వద్దిరాజు రవి చంద్రను మంగళవారం బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు గృహంలో ఎంపీ మాలోతు కవిత, సత్యవతి రాథోడ్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మారినేని వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు గద్దె రవి ఆధ్వర్యంలో రవిచంద్రను ఘనంగా సన్మానించారు. రాబోయే ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి కవిత గెలుపు కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

పాఠశాల తనిఖీ చేసిన ఎంపీడీవో

నవతెలంగాణ-కేసముద్రం రూరల్



మండలంలోని తాళ్లపూసపల్లి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మన ఊరు-మనబడిలో భాగంగా నిర్మించిన డైనింగ్ హాల్‌లో గ్రిల్స్ ఎందుకు నిర్మించలేదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్ కోట కనకయ్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎంపీడీవో రవి కుమార్ తాళ్ళపూసపల్లి ఉన్నత పాఠశాలలో ఎంపీ ఎలక్షన్స్ సంబంధించిన పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూపై హెచ్‌ఎం కోట కనకయ్యను మందలించి, మధ్యాహ్న భోజన కుక్ కం హెల్పర్‌లు వండేటప్పుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థిని, విద్యార్థులకు రుచికర భోజనం అందించాలని పలు సూచనలు చేశారు. రవీందర్ అప్పుడే తయారు చేసిన రాగి జావాను సేవించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోలా దర్గయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు నసీరుద్దీన్, ఉపాధ్యాయ బృందం, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరు అందించాలి : డీపీఓ

నవతెలంగాణ-చిన్నగూడూరు



వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా పంచాయతీ అధికారులు చొరవ చూపాలని డిపిఓ హరిప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో తాగునీటి అంతరాయంపై గ్రామస్తులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి పల్లె గిరిజన తండా కాలనీల్లో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు.అందుకు పంచాయతీ అధికారులు సిబ్బంది గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మండల కేంద్రంలో త్రాగునీటి సమస్య పునరావృతమైతే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణారెడ్డి, ఎంపీడీవో రామారావు ఎంపీఓ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో సాధారణ ప్రసావం

నవతెలంగాణ-గూడూరు

108 వాహనంలో సాధారణ ప్రసావం మంగళవారం జరిగింది. మచ్చర్ల గ్రామానికి చెందిన ఈసం రమాదేవి పురిటి నొప్పులతో ఇబ్బంది పడుతుండగా 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది అక్కడకు చేరుకుని మహబూబాబాద్ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో పురటి నొప్పులు ఎక్కువై సాధారణ సాధారణ ప్రసవం అయింది. వెంటనే సిబ్బంది, టెక్నీషియన్ భూక్య హనుమంత్, పైలెట్ రాజు తల్లి బిడ్డ సంక్షేమం కోసం మహబూబాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిని మహబూబాబాద్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగేందర్, మెడికల్ ఎగ్జిక్యూటివ్ మహేష్‌లు అభినందించారు

శరపంజరం సినిమాకు అండగా ఉంటాం

పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్



నియోజకవర్గంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన గట్టు నవీన్ కుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన శరపంజరం సినిమా తెలంగాణలో జరిగిన కొన్ని సంఘటనలను ఆధారంగా జోగిని వ్యవస్థను, తెలంగాణ గంగిరెద్దుల వారి జీవన విధానంతో తెరకెక్కించిన ఈ చిత్రం తొర్రూరు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరగడం, ఇక్కడి కళాకారులు నటించడం అభినందనీయమని, ఈ సినిమా చరిత్రను మనకు గుర్తుచేసే విధంగా ఉందని, ఈ సినిమా చూసి గత చరిత్రను తెలుసుకోవల్సిన అవసరం ఉందని నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి అనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ఈ సినిమాకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. తెలంగాణ పల్లె విధానాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. దర్శకుడు, హిరో, హిరోయిన్ కెమెరామెన్, నటినటులు అందరు ఇక్కడి వాళ్ళు అవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు, హిరో నవీన్ కుమార్ గట్టు, కెమెరామెన్ మస్తాన్ సిరిపాటి, నటులు మేరుగు మల్లేశం గౌడ్‌పాల్గొన్నారు.

ఫిష్ బ్రీడింగ్ పనులను ఏపీఓ పరిశీల



నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని పెద్దతూండ్ల గ్రామంలో ఉపాధి కూలీలు చేస్తున్న ఫిష్ బ్రీడింగ్ పనులను మంగళవారం ఉపాధిహామీ ఏపీఓ గిరి హరీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పరిధి ఊర చెరువులోని ఫిష్ బ్రీడింగ్ పనులను సందర్శించి కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పని చేస్తే ఒక్క రోజుకు రూ.300 కూలి వస్తుందన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో పని ప్రదేశాల్లో కూలీలకు మంచి నీళ్ల, నీడ పందిరి, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో కూలీలకు మంచి నీళ్ల, నీడ పందిరి, మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ అజ్మీర సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణ పట్ల అవగాహనా సదస్సు

నవతెలంగాణ - ములుగు



అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక కేంద్ర అధికారి ఎండీ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో మంగళవారం ములుగు పట్టణ ప్రజలకు అగ్ని మామాదాల నివారణ పట్ల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... అగ్ని ప్రమాదాలు అనుకోకుండా సంభవిస్తాయని అన్నారు. వంట చేస్తున్నప్పుడు గ్యాస్ ప్రమాదం సంభవిస్తే ఎలా అరికట్టాలో మాక్ డ్రిల్ ప్రోగ్రాం చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ పి మహేశ్వర్, డిఓపి రమేష్, ఎఫ్ఎం సురేందర్, హెచ్జి దన్ సింగ్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు



- వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి రేవూరి ప్రకాష్ రెడ్డి
- బీజేపీ, బీఆర్ఎస్ మాటలు నమ్మి మోసపోవద్దు
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- మోడీకి అధికారం ఇస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తాడు
- వరంగల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య



నవతెలంగాణ-భూపాలపల్లి

పదేండ్ల బీజేపీ పాలనలో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదని వరంగల్ పార్లమెంట్ ఇన్చార్జి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ ఏ ఎస్ ఆర గార్డెన్ లో జరిగిన ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షత వహించగా రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు ఎంపీ అభ్యర్థి కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.... కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలను తెచ్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రైతులు అడ్డుకుంటే కాల్చి చంపిన ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వమని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడుతుందని అన్నారు. విప్లవాలకు పురిటిగడ్డ అయిన భూపాలపల్లి నియోజక వర్గ ప్రజలు బీజేపీ ప్రభుత్వం మళ్లీ అవసరమా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కూడా కాకముందే డెవలప్ చేయడం లేదని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల్లో తెలంగాణలో 14 నుంచి 15 సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంటుందని,ఈ ఎన్నికలు ముగియగానే మిగిలిన గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎంపీ ఎన్నికల్లో కడియం కావ్యను ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించి దేశంలో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేలా ప్రతికార్యకర్త కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశం ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. భూపాలపల్లి నియోజక వర్గంలో అకాల వర్షాలకు ఎంతోమంది ఆర్థికంగా నష్టపోయిన పుటికీ బీజేపీ, బీఆర్ఎస్ పట్టించుకోలేదన్నారు. మొరంచపల్లి గ్రామానికి పరిశీల నకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఒక్క రూపాయి కూడా కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు ఇప్పించలేదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రం ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు వరంగల్ పార్ల మెంట్ అభ్యర్థి కడియం కావ్యాను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. తన 53 వేల మెజార్టీ కంటే ఇప్పుడు లక్ష మెజార్టీ సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాష్ రెడ్డి, ఓబీసీ జాతీయ అధ్యక్షులు కత్తి వెంకటస్వామి, రాష్ట్ర నాయకులు కట్టంగూరు రాంరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వి రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, రాష్ట్ర అధికార ప్రతినిధి గాదర్ల అశోక్, పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇంచార్జ్ మార్య విజయ్ కుమార్, పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, జిల్లా నాయకులు అప్పం కిషన్, పట్టణ అధ్యక్షుడు దేవన్, నాయకులు పిప్పాల రాజేందర్, బుర్ర కొమురయ్య, అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, పిల్లలమర్రి శారద నారాయణ, కుర్మిల రజిత శ్రీనివాస్, ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మోడీకి అధికారం ఇస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తాడు : వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య



దేశంలో మోదీకి మళ్లీ అధికారమిస్తే అంబేద్కర్ విగ్రహాలు తొలగించి, రాజ్యాంగాన్నిరద్దు చేస్తాడని కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకటేనని, తాను ఇక్కడే పుట్టి పెరిగానని, డాక్టర్ గా కడియం ఫౌం డేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు అందిస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో తనతోపాటు 14మంది ఎంపీలను గెలిపించాల్సిన బాధ్యత ప్రజలదేనని, అప్పుడే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతాడని చెప్పారు. బీజేపీ అభ్యర్థి వ్యాపారాలను పెంచు కునేందుకు రైతులను ఇబ్బంది పెట్టింది అందరికీ తెలుసన్నారు. బీజేపీ మాయమాటలు నమ్మిమోసపోవద్దని సూచించారు. అభివృద్ధి చేసే కాంగ్రెస్‌నే గెలిపించాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నవతెలంగాణ-మహాదేవపూర్

తాగునీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా సంబంధిత అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు. మంగళవారం కాటారం, మహాదేవపూర్ మండలాల్లో సంబంధిత అధికారులతో కలిసి సుడిగాలి పర్యటన చేపట్టారు. ముందుగా కాటారం మండల కేంద్రంలోని అయ్యప్ప కాలనీ సందర్శించి మంచినీరు సరఫరా, వినియోగంపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. అరకొర మంచినీటి సరఫరాతో ఇబ్బంది పడుతున్నామని కొంత మంది ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రిడ్ ఏఈలు, పంచాయతీ సెక్రెటరీలతో సమీక్షించి వారం రోజుల్లోగా ఇంటింటి సర్వే నిర్వహించి తాగునీరు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా మోటార్లు బిగించి నీటి వియోగానికి పాల్పడితే వారికి నోటీసు జారీ చేసి తగు చర్యలు తీసుకుని మోటార్లు సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ వారం రోజుల్లో మరోసారి సందర్శిస్తానని, మంచినీటి సరఫరాపై ప్రజలు ఫిర్యాదులు వస్తే విధుల నుండి తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం మహాదేవపూర్ మండల కేంద్రంలోని దుబ్బగూడెం కాలనీ, బొమ్మాపూర్‌లోని ఎస్సీ కాలనీ, రాపెల్లికోట గ్రామాలను సందర్శించి నీటి సరఫరాపై అడిగి తెలుసుకున్నారు. ఈ 3 నెలలు మంచినీటి ఎద్దడి లేకుండా ఎక్కడ పైపు లైన్ సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. కాటారం, మహాదేవపూర్ తహసీల్దార్‌లు ఎంపీడీఓలు, మిషన్ భగీరథ, గ్రిడ్ ఇంజినీర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభించాలి : జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నవతెలంగాణ-భూపాలపల్లి

పట్టణ అర్బన్ ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించాలని సింగరేణి ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన నీరు గంటసేపు అందించాలని జిల్లా కలెక్టర్ భవ్యష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి 16వ వార్డు రాంనగర్ కాలనీలో పర్యటించారు. సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ఆవరణలోని ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనుల చేపట్టాలని సంబంధిత మెడికల్, మునిసిపల్ అధికారులను అదేశించారు. వార్డులో చెత్త పేరుకుపోయిన ప్రదేశాన్ని సందర్శించి వెంటనే తొలగించాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. యాదవనగర్ కాలనీలో సింగరేణి గనుల నుండి వచ్చే నీటిని వడిసి పట్టి ఫిల్టర్ బెడ్ ద్వారా శుద్ధికరణ చేసే 6వ గని ఫిల్టర్ బెడ్‌ను సింగరేణి అధికారులతో కలిసి సందర్శించారు. గణపురం మండలం గాంధీనగంలోని మిషన్ భగీరథ ల్యాబ్‌లో నీటిని పరీక్ష చేసిన తరువాత పట్టణ ప్రజలకు నీరు సరఫరా చేయాలని అన్నారు. యాదవనగర్, కృష్ణ కాలనీలకు ఏప్రిల్, మే, జూన్ 3 నెలలు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తొద్దన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ కె వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ టి రాజేశ్వేర్, ఏఈ రోజా, తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలకు పాల్పడితే చర్యలు : జిల్లా ఎస్పీ

నవతెలంగాణ-భూపాలపల్లి



భూపాలపల్లి జిల్లాలో భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు. కబ్జాలకు దిగితే ఎవరినైనా వదిలేది లేదని, భూ కబ్జాలకు గురైన బాధితులు తమ పరిధి పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. సామాన్యులకు, పేద ప్రజలకు న్యాయం చేయడమే తమ అభిమతమని వెల్లడించారు. భూ కబ్జాకు యత్నించిన కౌన్సిలర్ కొత్త హరిబాబును మంగళవారం భూపాల పల్లి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. భూపాలపల్లి పరిధి కాసిం పల్లిలో ఓ వ్యక్తికి చెందిన జామాయిల్ తోటను ధ్వంసం చేసి కాపలాదా రులపై దాడి చేసి అక్రమంగా రోడ్లు వేసి పక్కా ప్రణాళికతో బాధితుడి భూమిని కబ్జా చేసేందుకు యత్నించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన భూపాలపల్లి పోలీసులు, మున్సిపల్ కౌన్సిలర్ కొత్త హరిబాబుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

పార్లమెంట్ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- మల్టీ జోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్



నవతెలంగాణ - ములుగు

పార్లమెంట్ ఎన్నికలను నిష్పక్షపాతంగా శాంతియుతంగా నిర్వహించాలని మల్టీ జోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ తెలిపారు. ములుగు జిల్లా కేంద్రంలో ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా ఎస్పి డాక్టర్ శబరిష్, ఏటూరునాగారం ఏఎస్పి గితే మహేష్ బాబా సాహెబ్, జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ములుగు జిల్లాలోని పెండింగ్ కేసులపై స్టేషన్ హౌస్ అధికారులను పోలీస్ స్టేషన్ల వారీగా పిలిచి సమీక్షించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ 2022 కన్నా ముందు పెండింగ్ కేసులన్నీ నెలలోపు గానీ, తదుపరి సమీక్ష సమావేశం నిర్వహించేలోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో మావోయిస్టు ప్రాబల్యం ఉన్నందున రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు. ఛత్తీస్‌ఘడ్-ములుగు సరిహద్దు ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ బలగాల ద్వారా ముమ్మర తనిఖీలు చేపట్టాలన్నారు. పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాలన్నారు. అక్రమ నగదు అక్రమ మద్యం అడ్డుకట్ట వేసేలా చెక్ పోస్ట్‌లు బలోపేతం చేయాలని తెలిపారు. ఛత్తీస్‌ఘడ్, కొత్తగూడెం వంటి అటవీ ప్రాంతాలతో సరిహద్దు కలిగి ఉండడం గంజాయి రవాణా ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో జిల్లా రహదారుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ప్రధాన ఇతర కూడళ్ల వద్ద ప్రత్యేక చెక్ పోస్ట్ నిర్వహించి వాహనాలను జల్లెడ పట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, డిఎస్పీ రాములు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ములుగు సిఐ రంజిత్ కుమార్, పస్రా సీఐ శంకర్, ఏటూరునాగారం సిఐ రాజు, వెంకటాపురం సిఐ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్ లైన్‌కు మరమ్మతులు



నవతెలంగాణ-మల్హర్‌రావు

'ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన' అనే శీర్షికన సోమవారం నవతెలంగాణ దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి ఎట్టకేలకు మిషన్ భగీరథ, ఇంట్ర, మండల పరిషత్, పంచాయతీ అధికారులు మంగళవారం స్పందించారు. మండల కేంద్రమైన తాడిచెర్లలోని రేగడిపల్లి 8వ వార్డులో తాగునీటి కోసం మహిళలు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చడానికి తాత్కాలికంగా ట్యాంకర్ తో నీటి సరఫరా చేశారు. ఉదయాన్నే మండల పరిషత్ అధికారి శ్యాం సుందర్, ఇంట్ర డీఈ రమేష్ బాబు, ఏఈ హరిత, పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున్ తదితరులు రేగడిపల్లిలో భగీరథ పైప్ లైన్ పనులకు మరమ్మ తులు చేపట్టారు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. అలాగే గ్రామంలో పలు వార్డుల్లో ఉన్న లీకేజీలను సైతం పరిశీలించారు. మండలం లోని 145 గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

నవతెలంగాణ ఎఫెక్ట్

రిక్రూట్ లేకుండా రిలీవ్ ఎందుకు ?

- ఎంఈఓపై కలెక్టర్ అసహనం



నవతెలంగాణ-వెంకటాపురం

జిల్లా పరిషత్ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పాఠశాల భవన నిర్మాణాలను పరిశీలించేందుకు మంగళవారం వచ్చిన ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవివి సత్యనారాయణ తీసుకొచ్చారు. స్పందించిన కలెక్టర్ ఉపాధ్యాయులు, సిబ్బంది ఖాళీల వివరాలు ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. కొత్తవారిని నియమించకుండా పాఠశాలలోని ఉపాధ్యాయులను ఎందుకు రిలీవ్ చేశారంటూ అసహనం వ్యక్తం చేశారు. మండల పరిధి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్మిస్తున్న నూతన భవనాలను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాగా పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్ ఉన్నాయని, నిర్మాణాలు పూర్తి చేయడం ఎలా సాధ్యమని కాంట్రాక్టర్లు వివరించారు. పనులు పూర్తి చేయండి.. బిల్లులు మొత్తం వచ్చేలా చర్యలు తీసికుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే వెంకటాపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను, వీరభద్రవరం యూపీఎస్ పాఠశాలను అదనపు కలెక్టర్ పి శ్రీజతో కలిసి సందర్శించారు. పాఠశాలల అభివృద్ధికి రూపొందించిన ప్రతిపాదనలో 25శాతం నిధులు ముందస్తుగా అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరు చేస్తామన్నారు. పనులు రికార్డ్ చేసిన వారం రోజు ల్లో బిల్లులు చెల్లిస్తామని, సకాలంలో పనులు పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన ఎలక్ట్రికల్ వస్తువులు, ఇతర చిన్న, చిన్న పనులు పూర్తి చేయాలని, వాటికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేస్తామని తెలిపారు. పాఠశాలల పునర్ ప్రారంభానికి ముందే టాయిలెట్లు, తాగు నీటి సరఫరా, తరగతి గదిలో మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో మరమ్మత్తుల పనులన్నీ నెలలో పూర్తి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి స్వర్ణలత లెనిన, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, పీఆర్ ఏఈ, రాజేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



నవతెలంగాణ-భూపాలపల్లి

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, రైతుల కోసం వేసిన రోడ్లపై రాజకీయ కక్షసాధింపు చర్యలు చేపట్టడం సరికాదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లా డారు. భూపాలపల్లి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబును సోమ వారం రాత్రి హన్మకొండలో అక్రమ అరెస్ట్ చేశారని అన్నారు. ఈ అరెస్ట్ పై జిల్లా ఎస్పీ, డీఎస్పీలను వివరణ కోరగా ల్యాండ్ విషయం పై విచారణ నిమిత్తం అరెస్ట్ చేసినట్టు చెప్పారని అన్నారు. 2021లో అనిల్‌కుమార్ యాదవ్ అనే ఫిర్యాదు ఇచ్చినట్లు చెప్తున్నారన్నారని, కానీ, కాసీంపల్లి గ్రామ రైతుల పొలాల వద్దకు వెళ్ళాలంటే మోకాలి లోతు బురదలో ఇబ్బందులు పడేవారని, రోడ్డు కావాలని కోరితే ఒప్పందం ప్రకారమే కాసీంపల్లి నుండి కుర్తి ఒర్రె వరకు రూ.15 లక్షలతో పనులు ప్రారంభించి పూర్తి చేశారని అన్నారు. టీయూఎఫ్ ఐడిసి నిధుల నుండి రూ.25 లక్షలు మంజూరు చేసి కుర్తి ఒర్రె నుండి తుండ్ల రోడ్డు వరకు రోడ్డు వేసినట్టు చెప్పారు. ఇది కూడా టెండర్ ద్వారా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇది జరిగి దాదాపు 3 సంవత్సరాలైందని అన్నారు. నాడు జరిగిన విషయంపై నిన్న కేసు పెట్టడం అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. సంబంధం లేని విషయంలో హరిబాబును, హరిబాబు తమ్ముడు దశరథంను అరెస్టు చేశారన్నారు. గత నెల రోజుల ముందు కూడా ఇలానే అరెస్టు చేసే ప్రయత్నం జరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల పై కేసులు బనాయించి అరెస్టు చేసి ఎన్నికల సమయంలో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎస్పీ, డీఎస్పీ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించిసమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సెగ్గెం సిద్ధు, ముంజంపల్లి మురళీధర్, మాడ హరీష్ రెడ్డి, కరాటే శ్రీనివాస్, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నవతెలంగాణ - ములుగు

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైందని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్క రు ఓటును ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఓటర్ సెల్ఫీ పాయింట్ ను అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి శ్రీజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మే 13వ తేదీన జరిగే పార్ల మెంట్ ఎన్నికలలో జిల్లాలో ఓటింగ్ శాతం పెరిగేలా అందరూ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని అన్నారు. ఇందుకు ప్రజలలో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, ఏపీడీ ఈజీఎస్ వెంకటనారాయణ, డీపీఎం సతీష్, ములుగు ఏపీఎం పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్(రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జి



నవతెలంగాణ- ములుగు

ఏప్రిల్ 25వ తేదీ నుంచి మే 2వ తేదీ వరకు జరుగనున్న ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జి అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహ ణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లను ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతించొద్దని అన్నారు. పోలీసులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించా రు. టెన్త్ ఓపెన్ స్కూల్‌కు సంబంధించి ములుగు జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 526మంది, ఇంటర్‌కు సంబంధించి 3పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 602 మంది పరీక్షలు రాయ నున్నట్టు చెప్పారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. పరీక్షలు సజావుగా సాగేలా ప్రత్యేక చర్య లు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఈఓ పాణిని, ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజినీర్ పి నాగేశ్వరరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పి వెంకటేశ్వర్లు, టీఓఎస్ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ శంకర్‌రావు, ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్, ఆర్ఎస్ఐ కనకయ్య, డిపో మేనేజర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

- వామపక్ష నేతల పిలుపు

నవతెలంగాణ - ములుగు

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలోని స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో వామపక్షాల సదస్సు మంగళవారం ఎండీ గఫూర్ పాషా అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంసీపీఐయూ పోలిట్ బ్యూరో సభ్యులు పల్లేపు ఉపేందర్‌రెడ్డి, సీపీఐఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, న్యూ డెమోక్రసీ నాయకులు మధు, ప్రజా సంఘాల నాయకులు ముంజల భిక్షపతి హాజరై మాట్లాడారు. దేశంలో ప్రధాని మోడీ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాటి నుంచి ప్రజలు, కార్మిక హక్కులను కాలరాస్తూ దేశ రైతాంగ సమస్యలు విస్మరిస్తూ ప్రయివేటు జపం చేస్తోందన్నారు. దేశంలో నిరుద్యోగం విలయతాండం చేస్తున్న అదానీ అంబానీలకు దేశ సంపదను దోచిపెట్టి విధంగా పరిపాలన సాగిందన్నారు. దేశంలో 400 సీట్లు బీజేపీకి వస్తాయని అందుకోసం మతోన్మాదాన్ని ముందుకు తీసుకొస్తూ రామ మందిర నిర్మాణాన్ని ప్రారంభించిన నరేంద్ర మోడీకి గుణపాఠం చెప్పాలన్నారు. ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తూ అరెస్టు చేసి జైల్లో పెట్టిందన్నారు. అవినీతిపరులు ప్రభుత్వానికి అనుకూలంగా బీజేపీ ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి అవినీతికి మారుపేరుగా బీజేపీ ప్రభుత్వం నిలిచిందని, రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు బీరెడ్డి సాంబశివ, పోదిల్ల చిట్టిబాబు, తీగల ఆగిరెడ్డి, గొంది రాజేష్, సీపీఐ జిల్లా నాయకులు ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు పల్లెబోయిన స్వామి నరసింహ, ఎంసీపీఐయూ జిల్లా నాయకులు గుండబోయిన చంద్రయ్య, రామ్ రెడ్డి, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ముక్తి సత్యం, ప్రతాప్ రెడ్డి, రత్నం రాజేందర్, రాజు, ప్రవీణ్, ఐలయ్య పాల్గొన్నారు.



నవతెలంగాణ 6
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
బుధవారం | ఏప్రిల్ 17, 2024 | www.navatelangana.com

'శ్రీ వైష్ణవి'లో శ్రీరామ నవమి వేడుకలు

నవతెలంగాణ-మంగపేట

మండల కేంద్రంలోని శ్రీవైష్ణవి పాఠశాలలో మంగళ వారం శ్రీరామ నవమి వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యా యుడు రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. దేశ వ్యాప్తంగా నేడు శ్రీ రామ నవమి వేడుకలు జరుగనుండగా ఒక్క రోజు ముందుగానే పాఠశాలలో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు రామాయణంలోని శ్రీరాముడు,సీత, ఆంజనేయుడు, జాంబవంతుడు, గణేషుడు, బ్రహ్మ, శివుడి వేషధారణలు ధరించి కార్యక్రమాలు నిర్వహిం చడం పట్ల పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ సన్మార్గంలో నడుచుకునేందుకు ఈ కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజశ్రీ, అనూష, కావేరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





కందాల రామయ్యకు డాక్టరేట్

నవతెలంగాణ - ములుగు

ములుగు మండలం అబ్బాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు కందాల రామయ్య ప్రతిష్టాత్మక ఉస్మానియావిశ్వవిద్యాలయం నుంచి మనో విజ్ఞాన శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నట్లు ఉస్మానియా యూనివర్సిటీ పరీక్షల విభాగ సంచాలకులు ప్రొఫెసర్ రాములు మంగళవారం తెలిపారు. కాకతీయ యూని వర్సిటీ సైకాలజీ విభాగ అధిపతి ఆచార్య వల్లూరి రామ చంద్రం పర్యవేక్షణలో 'ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఒత్తిడిని అధిగమించే విధానాలపై ఉద్వేగ ప్రజ్ఞ, వృత్తి పరమైన ఒత్తిడి, మూర్తిమత్వం' అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. ఉపాధ్యాయుడి గా 25 సంవత్సరాలు సుదీర్ఘ అనుభవం కలిగిన కందాల రామయ్య, పాఠ్య పుస్తక రచయితగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో రిసోర్స్ పర్సన్‌గా విద్యా శాఖకు ఎనలేని సేవలు అందించారు. నిత్య విద్యా ర్థిగా, నిరంతర పరిశోధకుడిగా ఉన్నత విద్యను కొనసా గి స్తూనే, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ 2022లో జాతీ య ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా దూరవిద్యా కేంద్రం కాకతీయ యూనివర్సిటీ సంచాలకు లు, మనోవిజ్ఞాన శాస్త్ర అధిపతి ప్రొఫెసర్ వల్లూరి రామ చంద్రం, ఉస్మానియా యూనివర్సిటీ విద్యా మనోవిజ్ఞాన శాస్త్ర ఆచార్యులు డాక్టర్ అనుపమ, డాక్టర్ స్వాతి, డాక్టర్ పాపిపల్లి శంకర్, జిల్లా విద్యా శాఖాధికారి జి పాని, ప్రధా నోపాధ్యాయులు జీ భాస్కర్, ఉపాధ్యాయులు కలిసి కందాల రామయ్యని అభినందించారు. భవిష్యత్తులో విద్యా మనోవిజ్ఞాన శాస్త్రంలో మరిన్ని వినూత్న పరిశోధ నలు చేస్తూ విద్యా రంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని రామయ్య తెలిపారు.

భద్రాచల సీతారాముల కళ్యాణానికి సుగంధ హారాలు



నవతెలంగాణ-మంగపేట

శ్రీరామ నవమిని పురస్కరించుకుని భద్రాచలంలో నేడు జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణానికి జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి శాంబశివరెడ్డి అరుదైన సుగంధ హారాలను మంగళవారం భద్రాచలం ఆలయ అధికారులకు, అర్చకులకు అందించినట్లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో సాంబశివరెడ్డి మాట్లాడుతూ ఈ సుగంధ హారాలను కేరళ రాష్ట్రం నుండి తెప్పించినట్లు తెలిపారు. స్వామి వారి కళ్యా ణం కోసం యాలకులతో హస్త కళాకారుల చేత ప్రత్యేకంగా రూపొందించారన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సుగంధ హారాలను దేవస్థానం అధికారులకు ఒకరోజు ముందుగానే అంద జేసినట్లు వెల్లడించాడు. కార్యక్రమంలో ఆలయ ఎఈవో రామకృష్ణ జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరాజు,వాసు, ఆలయ అర్చకులు అమరవాది మురళి కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ కేంద్రాలపై ఉన్న శ్రద్ధ పీఏసీఎస్ కేంద్రాలపై లేదు

తాడిచెర్ల పీఏసీఎస్ డైరెక్టర్లు

నవతెలంగాణ-మల్హర్‌రావు

డీసీఎంఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఉన్న శ్రద్ధ జిల్లా ఉన్నతాధికారులకు పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై లేదని సింగిల్ విండో వైస్ చైర్మన్ మల్క ప్రకాష్ రావు, డైరెక్టర్లు ఇప్ప మొండయ్య, వొన్న తిరుపతిరావు, సర్వర్ నాయక్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. రెండు వారాల క్రితమే పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సి



ఉండగా ఎందుకు ప్రారంభించలేదో చెప్పాలన్నారు. మండలంలో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలను రద్దు చేయాలని, ఈ కేంద్రాల ద్వారా రైతులను తరుగు పేరుతో దోచుకుంటున్నారని విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు వళ్లెంకుంట,మల్లారం గ్రామాల్లో డీసీఎంఎస్ కొనుగోలు ప్రారంభించారని అసహనం వ్యక్తం చేశారు. డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలు నడపడం ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఆదాయం తగ్గుతుందన్నారు. ప్రతి సంవత్సరం 12 పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సొసైటీ అభివృద్ధి కోసం తాము పాటుపడుతున్నట్లు వివరించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు డీసీఎంఎస్ కొనుగోలు రద్దు చేసి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే సొసైటీలో ఉన్న రైతుల భవిష్యత్ ప్రశ్నార్థకరంగా మారుతుందన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారుల పరిశీలన

నవతెలంగాణ-వెంకటాపురం

పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మార్కెట్ యార్డు, శివపురంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సివిల్ సప్లై అధికారి రాంపతి, డిప్యూటీ తహసిల్దార్ రామ్ చందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.... ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి పరిశీలించి టోకెన్లు జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు పంపాలన్నారు. కేంద్రం నుంచి అధికా రులు నాణ్యతను పరిశీలించి తరలించిన ధాన్యాన్ని మిల్లర్లు తరుగు పేరుతో కోతలు విధించొద్దని మిల్లర్లకు ఫోన్ ద్వారా తెలిపారు. ఈ



కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి ఆర్‌వివి సత్యనారాయణ, రైతులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-రేగొండ

మండలంలోని సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసిం హస్వామి కొడవటంచ ఆలయ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా స్వామివారి దర్శనార్థం ఆలయా నికి వచ్చే ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి నట్లు ఆలయ ఈవో ఎస్ మహేష్ తెలిపారు. ఆలయ అర్చకులు బుచ్చమాచార్యులు, శ్రీనివాస చార్యులు, ఆలయ సిబ్బంది రవి, శ్రావణ్ సుధాకర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గోరుకొత్తపల్లి మండల అధ్యక్షుడిగా రాజేందర్ రెడ్డి

నవతెలంగాణ-రేగొండ

నూతన మండల గోరికొత్తపల్లి బీజేపీ నూతన మండల అధ్యక్షుడిగా సూరిగురి రాజేం దర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమా వేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడుఏడునూతల నిషిధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నాగపురి రాజ మౌలిగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపయ్య హాజరై రాజేందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలి పారు. రేగొండ ఉమ్మడి మండల అధ్యక్షులు దాసరి తిరుపతి రెడ్డి జిల్లా కార్యదర్శి సుంకరి మనోహర్, సూదటి వేను రావు బీజేవైఎమ్ రాష్ట్ర నాయకులు సయ్యద్ గాలిబ్, బీజేవైఎం మండల అధ్యక్షులు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన ఆలయాలు



నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లా కేంద్రంలోని మారుతి నగర్‌లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం(శ్రీ క్షేత్రం) నేడు అంగరంగ వైభవంగా నిర్వహించబోయే శ్రీ సీతారాముల కళ్యాణ మహో త్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కమిటీ అధ్యక్షులు గండ్రకోట కుమార్ తెలిపారు. నేడు ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు జరిగే ఈ కళ్యాణ మహో త్సవంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని వీక్షిం చాలని కోరారు. కళ్యాణానంతరం మహా అన్నదాన ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. అనంతరం మహిళలు గోటి తలంబ్రాలు కార్యక్రమంలో పాల్గొనగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం ముద్దునూరు తండాకు చెందిన అఖిల భారత హనుమాన్ భక్త ప్రచారకులు గాదరి రాములు స్వామి సీతారాముల కళ్యాణ ఉత్సవానికి గోటి తలంబ్రాలు అందజేశారని తెలిపారు.



గోవిందరావుపేట : మండల వ్యాప్తంగా శ్రీ సీతారాముల కళ్యాణానికి రామాలయాలు అన్నీ ముస్తాబయ్యాయి. మంగళ వారం మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో గత నాలు గు రోజులుగా శ్రీ సీతారాముల కళ్యాణం కోసం ఏర్పాటు చేస్తున్న తాటాకు చలువ పందిళ్ళు, టెంట్లు పూర్తి అయినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మరాజు సత్యనారాయణ తెలిపారు. చల్వాయి దుంపెల్లి గూడెం, పస్రా, గాంధీనగర్‌తోపాటు ప్రతి గ్రామం ప్రతి తండా లోనూ సీతారాముల కళ్యాణాన్ని జరుపుకుంటారు. కొన్ని చోట్ల పండితులు లేకపోవడం వల్ల భద్రాచలం సీతారాముల వారి కళ్యా ణం కామెంట్రీ ద్వారా కళ్యాణ క్రతువులు పూర్తి చేస్తారు. కళ్యా ణానికి అవసరమైన సామాగ్రిని ఇప్పటికే దాతలు పెద్ద ఎత్తున సమకూర్చారు. వారి పేర్లతో సహా ఆలయ కమిటీ వారు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాగా అన్నదాన కార్యక్రమా లను చేపడుతున్న ఆయా ఆలయ కమిటీలు తెలిపాయి.

ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా మంచినీళ్ల హరీష్

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలానికి చెందిన మంచినీళ్ల హరీష్ ఎన్ఎస్‌యూఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శిగా నియామకమయ్యారు. మంగళవారం వరంగల్



పార్లమెంటరీ ఎన్ఎస్‌యూఐ ఎన్నికల సన్నాహక సమావేశంలో జరిగింది. కాగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బలుమూరి వెంకట్ ఆధ్వర్యంలో సంబంధిత నియామక పత్రాన్ని హరీష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ జిల్లా కార్యదర్శి నియామకానికి సహకరించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శీను బాబుకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
బుధవారం | ఏప్రిల్ 17, 2024 | www.navatelangana.com

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్

నవతెలంగాణ-వరంగల్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ అన్నారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లో మంగళవారం వార్షిక క్రీడా దినోత్సవం 2024 ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నందు బాలుర విభాగంలో పలు క్రీడలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని గెలుపొందిన వారిని అభినందించారు. జిల్లా స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నందు కూడా బాలికల విభాగంలో పలు క్రీడలలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుపొంది ఓవరాల్ ఛాంపియన్షిప్ గెలుపొందారని తెలిపారు. అనంతరం కళాశాల క్రీడా అధ్యాపకుడు ఎం.విజయకుమార్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా వరుసగా రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నందు బాలుర విభాగంలో ఓవరాల్ ఛాంపియన్షిప్ గెలుపొందారని తెలిపారు. తరువాత కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగం గా విద్యార్థిని విద్యార్థులు పాటలు, ఏకపాత్రాభినయం కార్య క్రమాలలో వారి ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్‌లు శ్రీనివాస్, ఎం.రాంప్రసాద్, జి.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



యువత చెడు వ్యసనాలకు లోనుకావద్దు : సీఐ

నవతెలంగాణ-నెక్కొండ



యువత , విద్యార్థులు చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని నిర్దేశించిన లక్ష్యం మేరకు చదువుకొని భవిష్యత్తులో స్థిరపడాలని నెక్కొండ తహసిల్దార్ రాజకుమార్, సిఐ చంద్రమోహన్ అన్నారు. పోలీస్ కమిషనర్, డీసీపి, ఏసీపి ఆదేశాల మేరకు నెక్కొండలో సీఐ చంద్ర మోహన్, తహశీల్దారు రాజ్ కుమార్, ఎస్సై మహేందర్ తో కలిసి తెలంగాణ స్టేట్‌యాంటీ నార్కటిక్ బ్యూరో అంటీ డ్రగ్స్ సంబంధించి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడుదారులు పట్టకుండా, మత్తుపదార్థాలకు బానిస కాకుండా వారిలో చైతన్యం నింపేందుకు వాల్‌పోస్టర్లు అతికించడం జరుగుతుందన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలు సరఫరా చేసినా, సేవించినా, పండించినా వారిపైన కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది , సొసైటీ సిఈవో మోడం సురేష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉద్యమకారుడు మృతి

నవతెలంగాణ-శాయంపేట



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన తెలంగాణ ఉద్యమకారుడు జలుగూరి రవీందర్ గుండె నొప్పితో బాధపడుతూ హనుమకొండ నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి తుది శ్వాస విడిచారు. మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన జలుగూరి రవీందర్ టీఆర్ఎస్ ఆవిర్భావం నుండి పార్టీలో చేరి క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. సిరికొండ మధుసూదనచారి నేతృత్వంలో తెలంగాణ ఉద్యమంలో పనిచేశారు. రవీందర్‌కు గుండెనొప్పి రావడంతో సోమవారం హనుమకొండ పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించారు. మంగళవారం మృతదేహాన్ని ఎమ్మెల్సీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి సందర్శించి కన్నీటి పర్యంతమై ఆయన భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంతిమయాత్రలో బగ్గీ రమేష్, గుర్రం రవీందర్, నిమ్మల మహేందర్, బుర్ర విజయ్, రవీందర్, కొమ్ముల శివ, తడక సుదర్శన్ గౌడ్, శానం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రవీందర్‌కు నేతల నివాళి ...

రవీందర్ మృతి చెందిన విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, నాగూర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, గంగుల మనోహర్‌రెడ్డి, మోహిబోద్దిన్, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, ఎంపిటిసి మేకల శ్రీనివాస్, మేకల వెంకన్న, అట్ల రమేష్, వెంకన్నలు పూలమాలవేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నవతెలంగాణ-శాయంపేట

ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నామని ఉపాధ్యాయురాలు లీలావతి తెలిపారు. శాయంపేట గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు వివరించారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్, మధ్యాహ్న భోజనపథకం అందిస్తున్నట్లు తెలిపారు. నైపుణ్యం ఉన్న క్రీడాకారులను గుర్తించి క్రీడలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పితుటి కరిత, ఉపాధ్యాయులు శంకర్బాయి పాల్గొన్నారు.

వ్యాపారస్తులు లైసెన్స్ తీసుకోవాలి

నవతెలంగాణ-ఆత్మకూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో అన్ని రకాల దుకాణా వ్యాపారస్తులు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయితీల నుండి లైసెన్సులు తీసుకోవాలని ఎంపీవో చేతన్ కుమార్ రెడ్డి అన్నారు. ఏప్రిల్ 20 లోపు షాపు యజమానులు అందరూ లైసెన్సు లు కలిగి వుండాలని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్‌లు

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్‌లు ముక్కెర అనూష ప్రేమ్‌సాగర్, దేవనాడి యశోద మల్లాజీ, మాజీ ఎంపిటిసి కోసారి గోపాల్ తో పాటు వార్డు సభ్యులు, కార్యకర్తలు మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పార్లమెంటు అభ్యర్థి కడియం కావ్య సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు, చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే జిఎస్ఆర్ తెలిపారు.

టీఏఎంఎస్ఏ ఎన్నికలు ఏకగ్రీవం

నవతెలంగాణ-సుబేదారి



జిల్లా తెలంగాణ అగ్రికల్చర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ ఎన్నికలు హనుమకొండ జిల్లాలోని టీఎన్జీవోస్ భవన్‌లో జరిగాయి. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా టీఎన్జీవో కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యులు లక్ష్మీ ప్ర సాద్ వ్యవహరించగా ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అధ్యక్షునిగా బి.నటరాజ్, కార్యదర్శిగా ఎన్.సునీత, అసోసియేట్ అధ్యక్షునిగా ఐజాజ్ అహ్మద్, కోశాధికారిగా ఎస్.కిరణ్ కుమార్‌లు ఎన్నికకాగా నూతన కార్యవర్గాన్ని ఉమ్మడి జిల్లా టీఎన్జీవో బాధ్యులు అభినందించి ఘనంగా సన్మానించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో పనికెల రాజేష్, ఆకుల రాజేందర్, గజ్జెల రామ్ కిషన్, బూరుగు రవి, పోలు రాజు, బైరి సోమయ్య, గాజే వేణుగోపాల్, దశరథం, శ్యామ్ సుందర్, మొయిజ్, పుల్లూరు వేణు గోపాల్, సలీం,రామ్ ప్రసాద్, రాజేష్ ఖన్నా, భగవాన్ రెడ్డి, ఉదయ్ భాస్కర్, రాజీవ్, ప్రణయ్, అశోక్, మెహబూబ్, శ్రీనివాస్, శివ, సాయి, సునీల్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ

నవతెలంగాణ-ఖానాపురం



మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ సందర్శించి ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న మహిళ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు.అనంతరం వారు డాక్టర్ జ్యోతి, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో ఉన్న అన్ని సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉండే ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సెంటర్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఆయన వెంట డాక్టర్ రుచిత, డాక్టర్ కల్పన, డాక్టర్ రాకేష్, వైద్య సిబ్బంది స్టాఫ్ నర్స్, మంగమ్మ, హెల్త్ సూపర్వైజర్ దేవిక, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, రాంప్రసాద్ రెడ్డి, ఏఎన్ఎంలు విజయ రాణి, సుజాత, జ్యోతి, రమాదేవి, భార్గవి, జ్యోతి, రమ్య పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

నవతెలంగాణ-వరంగల్

నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ ఎస్సి పార్లమెంట్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి ప్రావీణ్య ఆదే శించారు. పార్లమెంట్ ఎన్నికలు 2024 నిర్వహణ లో భాగంగా 15 వరంగల్ ఎస్సీ పార్లమెంట్ నియో జకవర్గానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18 నుండి వరంగల్ కలెక్టరేట్ లో స్వీకరించనున్న నేపథ్యంలో మంగళవారం సిపి అంబర్‌కిశోర్ ఝా, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపి అబ్దుల్ బారి, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, డిఆర్ఓ శ్రీనివాస్ లతో కలసి బారికేడ్ల ఏర్పాటు, పోలీసు బందోబస్తు, మీడి యా పాయింట్ తదితర ఏర్పాట్లపై వరంగల్ కలె క్టరేట్ ఆవరణ లో క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీ లించి సమర్థవంతంగా ఏర్పాట్లు చేయుటకు అధికారులకు తగు సూచనలు చేశా రు. ఈనెల 18 నుంచి ఈ నెల 25 నామినేషన్ ప్రక్రియ ముగిసే వరకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వందమీటర్ల దూరం వరకు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ఇతరులను ప్రవేశించ కుండా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయా లని సూచించారు. నామినేషన్ల స్క్రూటినీని నిర్వ హించే సమాచారం అభ్యర్థులకు తెలియజేసి, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

నామినేషన్ల పూర్తి ప్రక్రియను సీసీ కెమెరా లు, వీడియోగ్రఫి మధ్య చేపట్టాలన్నారు. అభ్యర్థి ఆర్ ఓ గది లోకి ప్రవేశించగానే కనబడేలా గడియారం ఏర్పాటు చేయాలని, అన్నారు.వరంగల్ సిటీ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లా డుతూ నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల మేరఇరువైపులా బారికేడ్‌లు ఏర్పాటు చేస్తారని, నామినేషన్ సమర్పించు అభ్యర్థులు 30 నిమి షాలు ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని, చివరి నిమిషం వరకు వేచిచూసే ధోరణి సరికాదని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిపిఆర్ ఓ ఆయుబ్ అలీ, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, పర్యవేక్షకులు విశ్వనారాయణ, తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

పల్లా, ఆరూరి, రాజయ్య తోడు దొంగలు : ఎమ్మెల్యే కడియం

నవతెలంగాణ-వేలేరు



మే 13న జరిగే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఉన్న కడియం కావ్యను స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషిచేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి సింగపురం ఇందిర, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన వేలేరు, ధర్మసాగర్ మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో కోరారు. ఇందిర అధ్యక్షతన రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి సంపత్, ప్రసాద్, ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకొని యూనివర్సిటీని, మెడికల్ కాలేజ్ నీ తెచ్చుకున్న జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఈ ప్రాంత అభివద్ధి కోసం 104కోట్ల దేవాదుల ఎత్తిపోతకం పథకం ద్వారా ఎన్ని కోట్ల కమిషన్ను తీసుకున్నారో తనకు తెలుసని, వర్ధన్నపేట నియోజకవర్గంలో రైతుల పొలాలు, భూములు ల్యాండ్ పూలింగ్ ద్వారా వందల ఎకరాలు భూకబ్జా చేసిన ఆరూరి రమేష్ ఓట్ల కోసం వస్తున్నాడని, వర్ధన్నపేటలో చెల్లని రూపాయి స్టేషన్ ఘన్పూర్‌లో ఎలా చెల్లుతుందని విమర్శించారు. అలాగే దళిత బంధు ద్వారా దళిత బిడ్డలని అన్యాయం చేసిన వ్యక్తి డాక్టర్ టి రాజయ్య అని తోడుదొంగలైన వీరు ముగ్గురు స్టేషన్ఘన్పూర్ లో ఓట్లు అడగడానికి వస్తున్నారని తస్మాత్ జాగ్రత్త అని కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో మొదటినుండి పనిచేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు ఎక్కడ అన్యాయం జరుగదని. చెల్లె ఇందిర నేను కంటికిరెప్పలా కాపాడుకుంటామని, కాని మీరు, నాతోపాటు, ఇటీవల కాంగ్రెసులో చేరిన ప్రతికార్యకర్త లోకసభ ఎన్నికలలో ప్రతిబూత్లో కావ్యకు అత్యధిక మెజారిటీ తీసుకురావాలని, రాబోయే స్థానిక సంస్థల సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలలో , నామినేటెడ్ పదవుల్లో ఇందిర, నేను కలిసి సముచిత స్థానం కల్పిస్తామని తక్షణ కర్తవ్యాన్ని మరువకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి, జడ్పిటిసి పిట్టల శ్రీలత, ఎంపీటీసీలు బాల్న వెంకటేశ్వర్లు, జల్తారు సంపత్ యాదవ్, మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, సద్దాం హుస్సేన్, మాజీ ఎంపీపీ రవి యాధవు, ధర్మసాగర్ మాజీ జెడ్పిటిసి కీర్తి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు మల్లికార్జున్, గోదల రాజిరెడ్డి నాయకులు రాంగోపాల్రెడ్డి, రెండు మండలాలలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి

- ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ దీప్

నవతెలంగాణ-కాశిబుగ్గ

రాష్ట్రంలోని మూడు ఎస్సీ రిజర్వుడు పార్లమెంటు స్థానాలలో మాదిగలకు ఒక్కస్థానం కూడా కేటాయించకుండా సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని ఎంఎస్పీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి ప్రణయ్‌దీప్ అన్నారు. మంగళవారం కాశిబుగ్గలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రణయ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనేది మాదిగలు మాత్రమేనన్నారు. రాష్ట్రంలో 80 లక్షల మంది ఉన్నా మాదిగలకు ఒక్క స్థానం కూడా కేటాయించకపోవడం ఆజాతిని మోసం చేయడమేనన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించి బిజెపి అభ్యర్థి ఆరూరి రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మందకృష్ణ మాదిగకు, ఎమ్మార్పీఎస్‌కు ఎంతో సహాయం చేశానని, గత ప్రభుత్వం ఇబ్బందిపెడితే కాపాడానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు కట్ల రాజశేఖర్, చింతం సిద్దు, రాజేష్‌కుమార్, వినయ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదవీ విరమణ అభినందన సభ

నవతెలంగాణ-పర్వతగిరి



మండలం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏను గల్ పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల పదవీ విరమణ అభినందన సభ ఏర్పాటు చేశారు. వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏప్రిల్, మే నెలలో పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ ఏనుగల్ పాఠశాలలో ఉద్యోగ విరమణ సన్మాన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గాయపు లింగారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ నెలలో చింత నెక్కొండ పాఠశాల నుండి ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ గా రిటైర్ అవుతున్న జడల చంద్రశేఖరంను కాంప్లెక్స్ ఉపాధ్యాయులు అందరూ ఘనంగా సన్మానించి అభినందన వీడ్కోలు పలికారు. అలాగే మే నెలలో రిటైర్ అవుతున్న ఉపాధ్యాయుడు కోమాకుల మల్లికార్జున, ఎడ్ల రవికుమార్ స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలలో రిసోర్స్‌పర్సన్‌గా సేవలు అందించి లాలు తండా పాఠశాలలో ఎంతో పేరు తెచ్చుకున్నటువంటి వారి సేవలను కొనియాడుతూ కాంప్లెక్స్ ఇన్చార్జ్ హెడ్మాస్టర్ కోట హైమావతి మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో చింత నెక్కొండ హెడ్మాస్టర్ అంజయ్య, డాక్టర్ బొమ్మెర కుమారస్వామి, తాటిపల్లి చైతన్య, నరసింహారావు, కూసూరి రమేష్, శ్రీధర్, మదిలీ మాయే, మహంకాళి రామస్వామి, దుగ్యాల సంపత్ రావు, నాగేశ్వరరావు నరసింహారావు, ఝాన్సీ రాణి, రాణి రుద్రమ, జయ, రమేష్, కిషన్, ఎల్ల రాజు, మోసిన్ అబ్దుల్ కలాం, మనోహర్ రాజు సుమారు 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు సఖి అవగాహన సదస్సు

నవతెలంగాణ-నడికూడ

మండల కేంద్రంలో మంగళవారం సఖి అవగాహన కార్యక్రమం ఏపీఎం రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. సఖి ముఖ్య ఉద్దేశాలు, అందించిన సేవలను తెలియజేయుటకు సఖి సెంటర్ కేసు వర్కర్ హరిత, పారామెడికల్ స్టాఫ్ సరిత పాల్గొన్నారు. అనంతరం వారు సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశాలు, వారు అందించిన సేవలను వివరించారు. ఐదు రకాల సేవల గురించి తెలుపుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివద్ధి శిశు సంక్షేమ శాఖవారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌన్సిలింగ్ సహాయం, వైద్య సహాయం, పోలీస్ సహాయం తాత్కాలిక వసతి, న్యాయ సహాయం. ఈ ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ చట్టాలపై ప్రతి ఒక్క మహిళలకు అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. 0870 2452112 అనే నెంబర్ కి కాల్ చేయడం ద్వారా బాధిత మహిళలకు సహాయం అందించబడుతుందన్నారు.

మాధన్నపేట చెరువు ఆయకట్టుకు సాగు నీరందిస్తాం

నవతెలంగాణ-నర్సంపేట



మాధన్నపేట పెద్ద చెరువు ఆయకట్టులో సాగు చేసిన పంట పొలాలకు నీరిందిస్తామని సాగు నీటి ఇంజనీరు శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు సాల్మన్ రాజ్ అన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మాధన్నపేట పెద్ద చెరువును సందర్శించారు. చెరువులో నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. మోటర్ల ద్వారా కాల్వల్లోకి నీటిని ఎత్తిపోసి చివరి ఆయకట్టులోని పంట పొలాలకు అందేలా తక్షణ చర్యలు చేపడు తామని చెప్పారు. ఈ సందర్భంగా డీఈ రాంప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి తక్కెళ్లపెల్లి రవీందర్‌రావు, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య, మాజీ వైఎస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మేరుగు సాంబయ్య, గంధం నరేందర్, జీ.కిషన్ రైతులు పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.5,37,200లు పట్టివేత

నవతెలంగాణ-వరంగల్



వరంగల్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో రాబోయే లోక్ సభ ఎలక్షన్స్‌లో భాగంగా నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.537200లు అండర్ బ్రిడ్జి, శివనగర్‌లో సరియైన ఆధారాలు లేకుండా నగదు డబ్బు రవాణా చేస్తున్న నగదు డబ్బును పట్టుకున్నమని ఏసీపీ నందిరామ్‌నాయక్ తెలిపారు. ఏ సీపీ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ శివనగర్ కు చెందిన పత్తిపాక రమేష్ వద్ద రూ.2.5 లక్షలు, వరంగల్ పెరుకవాడకు చెందిన పా శికటి శంకర్ వద్ద రూ.1,77,200లు, ఖిలా వరంగల్ తోట జగన్ నుండి రూ.110 లక్షలు ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా రవాణా చేస్తు న్నందున స్వాధీనంలోకి తీసుకొని మొత్తం నగదు రూ 5.37.200 లు ఎలక్షన్ ఫ్ల యింగ్ స్క్వాడ్ టీం ఇన్చార్జికి తగు చర్యనిమిత్తం అప్పగించ నైనదని తెలిపా రు. ఈ వాహనాల తనిఖీలో ఇన్‌స్పెక్టర్లు గోపి, పి మల్లయ్య,శివ కుమార్ ఇ న్స్పెక్టర్, ఇంతే జార్ గంజ్ పోలీస్ స్టేషన్, డివిజన్ సబ్ ఇన్స్పెక్టర్ లు వెంకన్న, మునీరుల్ల, మెహమూద్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

నవ తెలంగాణ-దామెర

అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేయగా వారి నుండి 140 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు ఎస్ఐ కొంక అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని లాదెళ్ల శివారు అన్నపూర్ణ రైస్‌మిల్లు క్రషర్లకు వెళ్లే దారిలో ముగ్గురు వ్యక్తులు మంగళ వారం సాయంత్రం అనుమానస్పదంగా కనిపించి పోలీసు వాహనాన్ని చూసి పారిపోతుండగా వారిని వెంబడించి పోలీసులు పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్ద రూ.3500 విలువైన140 గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. వారిని అదుపులోకి తీసుకొని దామెర రెవెన్యూ ఇన్స్పెక్టర్ గండ్ర సంపత్ సమక్షంలో వారిని హాజరుపరచగా నేరం ఒప్పుకోవడం తోజ జప్తు చేసి పంచనామ నిర్వహించి గద్దల భరత్, జన్ను విలాస్ అలియాస్ జాన్, జిల్లా అఖిల్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రికి దహన సంస్కారాలు చేసిన కూతుళ్లు

నవతెలంగాణ-చెన్నారావుపేట

తల్లిదండ్రులకు తల కొరివి పెట్టి పున్నామ నరకం నుండి తప్పించేది కుమారులు అంటారు. కానీ కుమార్తెలే తల కొరివి పెట్టి కర్మకాండలు నిర్వహించిన ఘటన మండల పరిధిలోని ఎల్లాయిగూడెం గ్రామంలో జరిగింది, మంగళవారం నల్లతీగల రాములు(70) అనారోగ్యంతో మృతి చెందారు. కుమారులు లేకపోవడంతో తన నలుగురు కుమార్తెలు తల కొరవి పెట్టి పాడె మోసి కర్మకాండలనునిర్వహించడంతో గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు.

అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ ప్లేయర్స్‌కు అండగా ఉంటాం

నవతెలంగాణ-హన్మకొండ

అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ ప్లేయర్స్‌కు అండగా ఉంటామని, వారికి సైతం రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి కల్పించాలని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మంగళవారం తెలిపారు. అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ ప్లేయర్స్‌కు ఇప్పటి వరకు రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో భోజన, నివాస, శిక్షణ ఇతర వసతులు కల్పించారని, రానున్న రోజుల్లో సైతం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ ప్లేయర్స్ కు కల్పిస్తున్న వసతిని తరలించినట్లైతే క్రీడాకారులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. తరలించే ఆలోచన ఉంటే విరమించుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, యువజన, క్రీడల విభాగం అధికారులు స్పందించి అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ క్రీడాకారులకు న్యాయం చేయాలని కోరారు. క్రీడాకారులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు కషి చేయాలని, ఇలా క్రీడాకారులకు అన్యాయం చేసే చర్యలకు పాల్పడవద్దని పేర్కొన్నారు.

మహిళ మిస్సింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-ఖానాపురం



స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేసి నట్లు ఎస్సై సిహెచ్ రఘుపతి తెలిపారు. ఎస్సై అందించిన వివరాల ప్రకా రం మండలంలోని మంగళవారిపేటకు చెందిన కుసుమ దివ్య (30) సోమవారం రోజు ఇంట్లో వారికి చెప్పకుండా బయటకు వెళ్లిందని తండ్రి దాసరి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమె ఇంట్లో నుండి వెళ్లేటప్పుడు లైట్ గ్రీన్ కలర్ సారీ ధరించి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 8712485234, 8712685025 ఫోన్ నెంబర్‌లలో సంప్రదించాలని తెలిపారు.

గురుకుల విద్యార్థుల విద్యా సముపార్జన యాత్ర

నవతెలంగాణ-నెక్కొండ

నెక్కొండలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 398 మంది విద్యార్థులు విద్యాసముపార్జన యాత్ర చేపట్టినట్లు పాఠశాల ప్రిన్సిపల్ చింత రవీందర్ తెలిపారు. రెండు విడతలుగా విజ్ఞానసముపార్జన కోసం వరంగల్ లోని రీజనల్ సైన్స్ సెంటర్ సందర్శించడంతోపాటు , జూపార్క్ , ఖిలా వరంగల్ లాంటి చారిత్రాత్మక ప్రాంతాలు దర్శించి విజయవంతముగా యాత్ర చేసినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

నవతెలంగాణ-నెక్కొండ

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మంగళవారం జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సారయ్య సందర్శించి పరీక్షలను పరిశీలించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో నిర్వహించబడుతున్న సమ్మేటివ్ 2 పరీక్షలను పరిశీలించారు.అదేవిధంగా కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సమయానికి అనుగుణంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రవికుమార్, నెక్కొండ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగారావు, ఉపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

హన్మకొండ మిథిలా నగర్ శ్రీ కోదండ రామాలయం ఆలయంలో బుధవారం శ్రీ రామ నవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం అంగర వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని రామాలయం ట్రస్ట్ చైర్మన్ నామిరెడ్డి సీతారామరెడ్డి,సెక్రటరీ గంగి సుధాకర్ రెడ్డి తెలిపారు.